• సామ్ వెడ్స్ రాజ్



సమంత మన ఊరి కోడలు

నటి సమంత పెళ్లి చేసుకుంది. తిరుపతికి కోడలైంది. ఫ్యామిలీ మ్యాన్ వెబ్ సిరీస్ నిర్మాత, దర్శకుడు, రచయిత రాజ్ నిడిమోరును కోయంబత్తూరులో ఈషా కేంద్రంలోని లింగ భైరవ ఆలయంలో సోమవారం వివాహం చేసుకుంది. రాజ్‌ది తిరుపతి. 1975 ఆగస్టు 4న జన్మించారు. ఎస్వీయూ ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ పూర్తి చేస్తుండగా సహచర విద్యార్థి కృష్ణ డీకే ఇతడికి పరిచయమయ్యారు. అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తుండగా డీకేతో కలసి సినిమాటోగ్రఫీలో ప్రవేశించారు. ఎనిమిది సినిమాలకు దర్శకుడిగా, రచయితగా పని చేశారు. 2015లో శ్యామల అనే అసిస్టెంట్ డైరెక్టర్‌ను వివాహం చేసుకున్నారు. వీరికి ఓ కుమార్తె ఉంది. 2022లో విడిపోయారు. ఇతడు తీసిన స్త్రీ సినిమాకు ఫిల్మ్‌ఫేర్ అవార్డు వచ్చింది. ఇతడి దర్శకత్వంలో సమంత నటించిన 'ఫ్యామిలీ మ్యాన్' వెబ్‌సిరీస్ సూపర్ హిట్ అయ్యింది. ఇటీవల సమంత నిర్మించిన శుభం చిత్రానికి రాజ్ క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా ఉన్నారు. ఫ్యామిలీ మ్యాన్ వెబ్ సిరీస్‌తో వీరి మధ్య పరిచయం ఏర్పడింది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి







విరిగిన ఏనుగు కాలుకు స్కానింగ్ - లారీలోకి ఎక్కిస్తున్న సిబ్బంది -తిరుపతికి లారీలో తరలింపు -జూలో క్రేన్ సాయంతో లారీలోంచి కిందకు దించుతూ...

'ఆపరేషన్ గజ' సక్సెస్

కాలు విరిగిన ఏనుగుకు కుంకీల సాయం

ఎస్వీ జూకు తరలించి వైద్య చికిత్సలు

యాదమరి/మంగళం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): యాదమరి మండల పరిధిలో కాలు విరిగి నడవలేని స్థితిలో ఉన్న ఒంటరి ఏనుగును తరలించేందుకు అటవీశాఖ చేపట్టిన 'ఆపరేషన్ గజ' సోమవారం విజయవంతంగా ముగిసింది. భారీ క్రేన్ సాయంతో ఏనుగును లారీలో ఎస్వీ జూ పునరావాస కేంద్రానికి తరలించారు. తమిళనాడు రాష్ట్రం నుంచి వారం క్రితం యాదమరి మండలంలోకి ప్రవేశించిన ఈ ఒంటరి ఏనుగు రెండ్రోజుల క్రితం డీకే చెరువు సమీపంలోని కమ్మపల్లి అటవీ బీట్ గుడ్డివానిచెరువు వద్ద జారిపడడంతో కాలు దెబ్బతిని కదల్లేని స్థితికి చేరుకున్న విషయం తెలిసిందే. ఆదివారం సీసీఎఫ్ యశోదా బాయి ఆధ్వర్యంలో అటవీశాఖ అధికారులు, వైద్యులు వచ్చి పరిశీలించారు. పలమనేరు సమీపంలోని ముసలిమడుగు నుంచి కుంకీ ఏనుగులు కృష్ణ, అభిమన్యులను రప్పించి మధ్యాహ్నం మూడు గంటల నుంచి సహాయక చర్యలు చేపట్టారు. చెరువు నుంచి కుంకీల సాయంతో ఒంటరి ఏనుగును బయటకు తీసుకొచ్చారు. అప్పటికి చీకటి పడడంతో ఆపరేషన్‌కు తాత్కాలికంగా విరామం ఇచ్చారు. సోమవారం ఉదయం అటవీశాఖ సిబ్బంది తమ ప్రయత్నాలను పునః ప్రారంభించారు. కుంకీల సహాయంతో దెబ్బతిన్న ఏనుగును కదలకుండా చేశాక దెబ్బతిన్న ఏనుగు కాలును స్కాన్ చేశారు. అనంతరం భారీ క్రేన్‌ను ఉపయోగించి ఏనుగును క్షేమంగా లారీలోకి ఎక్కించారు. అటవీ, పోలీసుల కాన్వాయ్ సహకారంతో ఏనుగును సోమవారం మధ్యాహ్నానికి తిరుపతిలోని ఎస్వీ జూకు తీసుకొచ్చారు.ఈ తరలింపు ప్రక్రియను డీఎఫ్‌వో శ్రీనివాసులు, రేంజర్లు థామస్, పట్టాభి తదితరులు పర్యవేక్షించారు. జూకు తీసుకువచ్చిన ఏనుగును అధికారులు అతికష్టం మీద భారీక్రేన్ సాయంతో ఏనుగుల ఎన్‌క్లోజర్‌లోకి పంపారు. ఏనుగుకు వెనుకవైపు ఉన్న ఎడమకాలు విరిగిందని జూ అసిస్టెంట్ క్యూరేటర్ జగదీష్‌చంద్ర ప్రసాద్ తెలిపారు. కాలుకు ఎక్స్‌రే తీసి బ్లడ్ శాంపిల్స్ సేకరించామని.... ఏనుగు ఆరోగ్యం బాగానే ఉందని కాలు విరగడం వల్ల నడవలేకపోతోందని చెప్పారు. ఇప్పటికే ఏనుగుకు ఇద్దరు డాక్టర్లు వైద్యం అందిస్తున్నారని ఆహారం కూడా తీసుకుందని వివరించారు.



ఎన్‌క్లోజర్‌లోకి ఏనుగు తరలింపు

తప్పిన దిత్వా ముప్పు!

• బలహీనపడిన తుఫాను • మరో రెండు రోజులు వర్ష సూచన

సూళ్లూరుపేట/తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లాకు 'దిత్వా' ముప్పు తప్పింది. తుఫాను బలహీన పడినా.. దాని ప్రభావంతో వర్షాలు పడే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరించింది. సోమవారం రాత్రి ఉత్తర తమిళనాడు పుదుచ్చేరి మీదుగా చెన్నైకు తూర్పు 10 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమైంది. అర్ధరాత్రికి వాయుగుండం బలపడే అవకాశంఉంది. దీంతో మంగళవారం జిల్లాలో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశముందని వాతావరణశాఖ తెలియజేసింది. మరోవైపు సోమవారం తెల్లవారు జాము నుంచి జడివాన కురుస్తోంది. తేలికపాటి వర్షాలు కావడంతో ఇప్పటి వరకు ఆస్తి, పంట నష్టాలు సంభవించలేదు. శ్రీకాళహస్తి, ఏర్పేడు, తొట్టంబేడులో నాలుగు పూడిగుడిసెలు నేలకూలాయి. నాయుడుపేట-వెంకటగిరి మార్గంలో స్వర్ణముఖి నదిలో నీటి ప్రవాహానికి ఒకరు కొట్టుకుపోతుండగా పోలీసులు సురక్షితంగా బయటకు తీశారు. ఇక, కలెక్టర్ వెంకటేశ్వర్ ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్షిస్తూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఇక, కోట మండలం శ్రీనివాససత్రం, గోవిందపల్లిపాళెం, యమదిన్నెపాళెం ప్రాంతాల్లో భారీ అలలు ఎగిసిపడుతూ సముద్రం కొన్ని మీటర్లు ముందుకువచ్చింది.

వర్షపాతం: మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం 6గంటల వరకు సత్యవేడులో 38.2 మి.మీ., తడలో 37.4, వరదయ్యపాళెంలో 35.8, బీఎన్ కండ్రిగలో 30.4, సూళ్ళూరుపేటలో 24, ఓజిలిలో 20.8, పెళ్లకూరులో 20.4, కేవీబీపురంలో 18.6మి.మీ చొప్పున వర్షపాతం నమోదైంది. మరో 11 మండలాల్లో చినుకులు తప్ప పెద్దగా వర్షపాతం నమోదు కాలేదు.

బీఎన్‌కండ్రిగ మండలం వెరిణికండ్రిగ వద్ద నీట మునిగిన వరి



మల్లిమడుగులో 9 గేట్ల ఎత్తివేత

రేణిగుంట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట మండలంలోని మల్లిమడుగు డ్యాంకు 2100 క్యూసెక్కుల నీళ్ల వస్తోంది. దీంతో సోమవారం ఉదయం 9 గేట్లను ఒక అడుగు పైకి ఎత్తి 2400 క్యూసెక్కుల నీటిని వదులుతున్న డీఈ చంద్రమౌళి తెలిపారు.





కాళంగిలో రెండు గేట్లు ఎత్తివేత

కేవీబీపురం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి):కేవీబీపురం మండలంలోని కాళంగి జలాశయం నీటి మట్టం 18.6 అడుగులకు చేరుకుంది. దీంతో సోమవారం రెండు గేట్లను రెండు అడుగుల చొప్పున ఎత్తి నీటిని దిగువకు విడుదల చేసినట్లు ఆయకట్టు అధ్యక్షుడు రాజారెడ్డి తెలిపారు.

సూత్రధారి.. పాత్రధారి భూమనే



తిరుమల పరకామణి కేసులో సూత్రధారి, పాత్రధారి వైసీపీ నేత భూమన కరుణాకరరెడ్డే. చోరీ చేసిన దొంగ నుంచి ఆస్తుల బదలాయింపు ఆయనకే జరిగింది. కేసులో ఆయన ఉన్నందునే వ్యంగ్యంగా మాట్లాడుతున్నారు. కల్తీ నెయ్యి కేసులోనూ తప్పు జరిగినట్లు విచారణలో అందరూ అంగీకరించారు. కానీ తప్పు మాత్రం ఒకరిపై ఒకరు నెట్టుకుంటున్నారు.

- తిరుపతిలో మంత్రి అనగాని సత్యప్రసాద్

కల్యాణమస్తు పేరిట తాళిబొట్లు అమ్ముకున్నాడు



శ్రీవారిని నల్లరాయి అని, తిరుమల కొండను బోడిగుండని తిరుమల ప్రతిష్ఠను దిగజార్చారు. కల్యాణమస్తు పేరుతో తాళిబొట్లను అమ్ముకున్నాడు. ఆచారాలు, సంప్రదాయాల పేరుతో వ్యాపారం చేశాడు. సీఐడీ విచారణ తర్వాత భూమన వెటకారంగా మాట్లాడడం విడ్డూరం. పరకామణి చోరీ కేసును రాజీచేయడానికి నీవెవరు? పాపాలన్నీ బయటపడుతున్నా బరితెగించి మాట్లాడడం సిగ్గుచేటు.

- ఓవీ రమణ, టీటీడీ మాజీ సభ్యుడు

హోటళ్లకు మళ్లీ బాంబు బెదిరింపు

• ఫేక్ మెయిల్స్‌గా తేల్చిన పోలీసులు



రాజ్‌పార్కు హోటల్‌లో తనిఖీ చేస్తున్న పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో మరోసారి బాంబు బెదిరింపు కలకలం సృష్టించింది. కపిలతీర్థం వద్దనున్న పాయ్ వైస్రాయ్, రాజ్ పార్కు హోటళ్ల వద్ద ఐఈడీ బాంబులు పెట్టామని, ఏ క్షణమైనా పేలతాయంటూ పాక్ ఐఎస్ఐ పేరిట సోమవారం మెయిల్స్ వచ్చాయి. ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాలతో డీఎస్పీ భక్తవత్సలం, సీఐ రాంకిషోర్, ఎస్ఐలు అజిత, నాగార్జున రెడ్డి, బాంబు స్క్వాడ్ ఎస్ఐ పీరయ్య, సిబ్బంది మెటల్ డిటెక్టర్లు, బాంబు నిర్వీర్యం పరికరాలతో రెండు హోటళ్లలో నిశితంగా తనిఖీలు చేపట్టారు. దాదాపు రెండు గంటల పాటు తనిఖీలు చేశాక.. ఎలాంటి పేలుడు పదార్థాలు, ఐఈడీ బాంబులు లేవని నిర్ధారణకు వచ్చారు. కాగా, ఏడాదిగా తిరుపతిలోని పలు హోటళ్లు, వివిధ రకాల సంస్థలు, ఇస్కాన్ మందిరానికి బాంబు బెదిరింపు మెయిల్స్ వచ్చిన విషయం తెలిసిందే. వీటిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఏం జరిగిందో.. ఏమో?

దామినేడులో ముగ్గురి అనుమానాస్పద మృతి • ఆలస్యంగా వెలుగుచూసిన ఘటన




మనీష్, పూన్‌గొట్టాయి (ఫైల్‌ఫొటోలు)

తిరుచానూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆమెకు వివాహమైంది. మగబిడ్డ ఉన్నాడు. ఆ బిడ్డతో ప్రియుడి వద్దకు వచ్చేసింది. ముగ్గురూ కలిసి తిరుపతి రూరల్ మండలం దామినేడులో ఉంటున్నారు. ఏం జరిగిందో ఏమో గానీ.. అతడు ఫ్యానుకు వేలాడుతూ.. ఆమె, బిడ్డ బాత్‌రూమ్‌లో విగతజీవులుగా పడుండటం సోమవారం వెలుగు చూసింది. ఆ గది తలుపునకు లోన గడియ పెట్టిఉండగా బయట తాళం వేసి ఉండటం అనుమానాలకు తావిస్తోంది. తిరుచానూరు ఎస్ఐ అరుణ తెలిపిన ప్రకారం.. తమిళనాడు రాష్ట్రం వేలూరు జిల్లా గుడియాత్తానికి చెందిన సత్యరాజ్(36), పూన్‌గొట్టాయి(21) ఇష్టపడ్డారు. ఆ తర్వాత ఏం జరిగిందో కానీ ఆమెకు వేరే వ్యక్తితో పెళ్లయింది. కుమారుడు మనీష్(3) ఉన్నాడు. ఆరు నెలల కిందట భర్తను వదలి ఆమె బిడ్డతో కలిసి సత్యరాజ్ వద్దకు వచ్చింది. ఈ ముగ్గురూ కలిసి తిరుపతి రూరల్ మండలం దామినేడు హౌసింగ్‌కాలనీలో అద్దెకు ఉంటూ కూలి పనులు చేసుకునేవారు. వారం కిందట తిరుపతిలోని తమ సమీప బంధువుతో మాట్లాడారు. ఆ తర్వాత వారి నుంచి ఎలాంటి సమాచారం లేకపోవడంతో సోమవారం వారి బంధువులు ఇంటికి వచ్చారు. లోపల నుంచి దుర్వాసన వస్తోంది. బయట తాళం వేసి ఉంది. అనుమానం వచ్చి తిరుచానూరు పోలీసులకు సమాచారమిచ్చారు. సీఐ సునీల్‌కుమార్, ఎస్ఐ అరుణ, సిబ్బంది అక్కడికి వెళ్లారు. లోపల తలుపునకు గడియ పెట్టి ఉంది. తలుపు పగులగొట్టి లోపలకు వెళ్లగా సీలింగ్‌కు బెడ్‌షీట్‌తో ఉరేసుకుని సత్యరాజ్.. పక్కనే బాత్‌రూమ్‌లో పూన్‌గొట్టాయి, మూడేళ్ల మనీష్ విగతజీవులుగా పడున్నారు. వారం కిందట మృతి చెందినట్లు భావిస్తున్నారు. అనుమానాస్పద రీతిలో మృతిగా కేసు నమోదు చేసి మూడు మృతదేహాలను రుయా మార్చురీకి తరలించారు. ముగ్గురూ కలిసి ఆత్మహత్యకు పాల్పడ్డారా లేదా తల్లీ బిడ్డకు విషమిచ్చి సత్యరాజ్ ఉరేసుకున్నాడా? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు సాగిస్తున్నారు. లోపల గడియ వేసి ఉండటం.. బయట తాళం వేసి ఉండటంతో మరో కోణంలోనూ పోలీసులు విచారిస్తున్నారు.

జీవకోనలో పింఛన్లు పంపిణీ చేస్తున్న మంత్రి అనగాని తదితరులు



2,43,184 మందికి పింఛన్ల పంపిణీ

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సోమవారం ఉదయం 8 గంటలకు పింఛన్ల పంపిణీ మొదలైంది. వర్షం పడుతున్నా సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పింఛన్లు అందించారు. మొత్తం 2,62,108మందికిగాను సాయంత్రం 7 గంటలకు 2,42,935 మందికి (92.78శాతం) రూ.104.16 కోట్లను పంపిణీ చేసినట్లు డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు, ఏపీడీ ప్రభావతి తెలిపారు. తిరుపతి నగరం జీవకోనలో మంత్రి అనగాని సత్యప్రసాద్, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, పలువురు కార్పొరేటర్లు, కలెక్టర్ వెంకటేశ్వర్, ఇన్‌చార్జి జేసీ మౌర్య తదితరులు పింఛన్లను పంపిణీ చేశారు.

నేడు కలెక్టరేట్‌లో డీఆర్సీ మీటింగ్

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో మంగళవారం ఉదయం 11 గంటలకు జిల్లా సమీక్షా సమావేశం(డీఆర్సీ) జరగనుంది. వివిధ శాఖల పనితీరు, సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి పనులపై సమీక్షించనున్నారు. ఈ సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్‌తో పాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు, కలెక్టర్ వెంకటేశ్వర్‌తోపాటు వివిధ శాఖల అధికారులు పాల్గొననున్నారు.

చర్చించే అంశాలు

- మొంథా తుపానుతో నష్టాలు, తీసుకున్న సహాయక చర్యలు.
- కేవీబీపురం మండలం గూళ్లూరు రాయల్ చెరువుకు గండిపడటంతో నష్టపోయిన వారికి ఎలాంటి సహాయం అందించాలి.
- శెట్టిపల్లె భూముల్లో అభివృద్ధి పనులు.
- గ్రేటర్ తిరుపతికి కార్పొరేషన్ ఆమోదించింది. విలీనానికి పలు పంచాయతీలు అభ్యంతరం చెబుతున్నాయి. దీనిపైనా చర్చ జరగనుంది.
- జనవరి 11, 12 లేదా 17, 18 తేదీల్లో సూళ్లూరుపేటలో పక్షుల పండుగ నిర్వహణ, ఏర్పాట్లపై సమీక్షించనున్నారు.
- తిరుపతి నగరం గాంధీరోడ్డులో శిథిలావస్థకు చేరుకున్న హథిరాం మఠం భవనాన్ని ఏం చేయాలనే దానిపై ఒక నిర్ణయానికి రానున్నారు.

జిల్లా కేంద్రమా.. నెల్లూరులో విలీనమా?

• ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలంటూ గూడూరులో జేఏసీ నిరసన

గూడూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గూడూరును జిల్లా చేస్తారా? లేదా నెల్లూరు జిల్లాలో విలీనం చేస్తారా? ఈ రెండింటిలో ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలంటూ జేఏసీ నేతలు డిమాండు చేశారు. జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. వర్షంలోనూ టవర్‌క్లాక్‌సెంటర్ నుంచి రైల్వేస్టేషన్, సంఘం థియేటర్, రాజావీధి మీదుగా టవర్‌క్లాక్‌సెంటర్ వద్దకు చేరుకుని మానవహారం ఏర్పాటు చేశారు. గూడూరును తిరుపతిలో కలపడంతో జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే ఇబ్బందిగా ఉందన్నారు. ఎన్నో ఏళ్లుగా నెల్లూరుతో ఉన్న అనుబంధాన్ని కొనసాగిస్తూ ఇటు విలీనం చేయాలన్నారు. తద్వారా ఎన్నికలకు ముందు చంద్రబాబు, లోకేశ్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. గూడూరు ప్రజల ఆకాంక్షను నెరవేర్చే వరకు ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అనంతరం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఏవో శిరీషకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పవన్, దశరథరామిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, వేగూరు రాజేంద్రప్రసాద్, బాలకృష్ణంరాజు, మోహన్‌దాస్, చిరంజీవి, జమాలుల్లా, కోడూరు మీరారెడ్డి, ఉపాధ్యాయులు, ఉద్యోగ సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వివిధ పార్టీల నేతలు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న జేఏసీ నాయకులు

చెరువు కట్టకు రంధ్రం


కుంట కట్టకు పడిన రంధ్రం, ఇసుక బస్తాలతో పూడ్చుతున్న అధికారులు

భాకరాపేట, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు మండలం ఎగవూరు పంచాయతీలోని నేలపరెడ్డి కుంట కట్టకు రంధ్రం పడింది. గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు కుంట పూర్తిస్థాయిలో నిండింది. చెరువు కట్టకు రంధ్రం పడిన విషయాన్ని స్థానికులు గుర్తించి ఇరిగేషన్ అధికారులు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన ఇరిగేషన్ ఏఈ గిరీశ్ కుమార్ రంధ్రం పడిన ప్రాంతంలో ఇసుక బస్తాలు వేసి పూడ్చి వేశారు. దీంతో కట్టకు ఇబ్బంది లేదని ఆయకట్టు రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

వైద్యులు సమయపాలన పాటించాలి


మెడికల్ ఆఫీసర్‌తో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

భాకరాపేట, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): వైద్యులు సమయపాలన పాటించాలని టీడీపీ మండల నాయకులు మెడికల్ ఆఫీసర్ శ్రీధర్‌ను సోమవారం కోరారు. చిన్నగొట్టిగల్లు సామాజిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న సిబ్బంది సకాలంలో విధులకు హాజరు కావడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయని, ఆసుపత్రి పనివేళల్లో అందుబాటులో ఉండాలన్నారు. రోగుల పట్ల మర్యాదగా వ్యవహరించాలన్నారు. ప్రభుత్వం పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కృషి చేస్తోందని, ఆసుపత్రి సిబ్బంది సహకరించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు బెల్లంకొండ మురళి, క్లస్టర్ ఇన్‌ఛార్జ్ శివకుమార్, సింగిల్ విండో అధ్యక్షులు ముత్తం ప్రభాకర్, మదనమోహన, మోహన్‌రెడ్డి, బెల్లంకొండ రమణ, సహదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకొస్తాం

● ఏఐసీసీ కార్యదర్శి డాక్టర్ జయకుమార్


సమావేశంలో మాట్లాడుతున్న జయకుమార్

చంద్రగిరి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఏపీలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకొస్తామని, రానున్న ఎన్నికలలో ఏపీలో ఇతర పార్టీల పొత్తుతో ఎన్నికలకు వెళతామని ఏఐసీసీ కార్యదర్శి డాక్టర్ జయకుమార్ వెల్లడించారు. సోమవారం చంద్రగిరిలోని వైఎస్ఆర్ఎం కళ్యాణ మండపంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన జయకుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి రాష్ట్రవ్యాప్తంగా డీసీసీ అధ్యక్షుల ఎంపిక కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. అనంతరం మండల, బూత్ కమిటీల నియామకం చేపడతామన్నారు. చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ఐరాల లోకేష్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని మండల, స్థాయి, గ్రామస్థాయిలో బలోపేతం చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ డాక్టర్ దామోదర్, పీసీసీ ఉపాధ్యక్షుడు దుర్గారెడ్డి రాంభూపాల్ రెడ్డి, ఎస్సీ సెల్ నాయకులు దామోదర్, పోటుగారి భాస్కర్, టిక్కి రాయల్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంబేడ్కర్ లా కాలేజీ విద్యార్థులకు అవార్డులు


బహుమతి సాధించిన విద్యార్థులతో చైర్మన్ డాక్టర్ తిప్పారెడ్డి

తిరుపతిరూరల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): రేణిగుంటరోడ్డులోని డాక్టర్ అంబేడ్కర్ గ్లోబల్ లా ఇన్‌స్టిట్యూట్ విద్యార్థులు తమిళనాడు రాష్ట్రం తిరుచురాపల్లిలోని ధనలక్ష్మి శ్రీనివాసన్ వర్సిటీలో నిర్వహించిన జాతీయస్థాయి మూట్ కోర్ట్ పోటీల్లో పాల్గొని ప్రతిభచాటారని సంస్థ చైర్మన్ డాక్టర్ ఆర్.తిప్పారెడ్డి పేర్కొన్నారు. ఈపోటీల్లో తమ విద్యార్థులు ధరణి, యశ్వంత్, జ్ఞాని సమగ్ర న్యాయ పరిశోధనా నైపుణ్యాన్ని ప్రదర్శించి బెస్ట్ రీసెర్చర్ అవార్డు సాధించారన్నారు. ప్రతిభచాటిన విద్యారులని, మ్యూట్ ట్రైనర్స్ అతిర, అక్షయ్, కమిటీసభ్యులను ఆయనతోపాటు ప్రిన్సిపాల్ డాక్టర్ బిజయకుమార్ బెహరా, సెక్రటరీ ఆర్.లక్ష్మీ ప్రశస్త అభినందించారు.

ఎర్రావారిపాలెం తహసీల్దార్‌గా వాసుదేవకుమార్



ఎర్రావారిపాలెం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఎర్రావారిపాలెం తహసీల్దార్‌గా వాసుదేవకుమార్‌కు పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశాలు జారీ చేశారు. ఇక్కడ పని చేస్తున్న తహసీల్దార్ పరమేశ్వర స్వామి నవంబరు 30న పదవీ విరమణ చేశారు. ఆయన స్థానంలో ఇక్కడే డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న వాసుదేవ కుమార్‌ను పూర్తిస్థాయి తహసీల్దార్‌గా నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన తహశీల్దార్‌గా పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు ఆయనకు అభినందనలు తెలిపారు. వాసుదేవకుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ భూములు కాపాడడంతో పాటు పేదలకు సత్వరమే సేవలందే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

ఎయిడ్స్ పట్ల అవగాహన కలిగి ఉండాలి



ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

పాకాల, డిసెంబరు 1: ఎయిడ్స్‌పై అవగాహన కలిగివుండాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్ కుమార్ అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు, కార్యాలయ సిబ్బంది సోమవారం ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. హెచ్ఐవీ నిర్మూలనకు అందరూ కృషిచేయాలన్నారు. వైద్యుల సూచన మేరకు క్రమం తప్పకుండా మందులు తీసుకొని పౌష్టికాహారంతో ఆరోగ్యంగా జీవించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్, ఎన్ఎస్ఎస్ పీవో మాశిలామణి, అధ్యాపకులు చిట్టికళావతి, రమణమ్మ, మోహన్ బెహరా పాల్గొన్నారు.

తిరుమలలో గీతాపారాయణం



తిరుమల, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని నాదనీరాజనం వేదికపై సోమవారం గీతా పారాయణం నిర్వహించారు. ధర్మగిరి వేదవిజ్ఞానపీఠం ఆధ్వర్యంలో 50 మంది వేదపండితులు భగవద్గీతలోని 18 అధ్యాయాలలోని 700 శ్లోకాలను పారాయణం చేశారు. వేదవిజ్ఞానపీఠం పిన్సిపాల్ అవధాని, పండితులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ


పింఛన్లు పంపిణీ చేస్తున్న మధుశేఖర్

తిరుచానూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం పాడిపేట పంచాయతీ శేషాద్రినగర్‌లో ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్లను పార్టీ నేతలతో కలిసి సింగిల్‌విండో చైర్మన్ మధుశేఖర్ లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నవీన్, విజయకుమార్‌నాయక్, కళావతి, భాగ్యలక్ష్మి, శశి, మహాలక్ష్మి, శ్రీలక్ష్మి, శ్రీనివాసులునాయుడు, మణిమాల పాల్గొన్నారు.

బడి పక్కనే చెత్త


తిమ్మరాజుపల్లి పాఠశాల వద్ద నిల్వ ఉన్న చెత్త

రామచంద్రాపురం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): తిరుపతి-అనుపల్లి ప్రధాన రహదారిలో తిమ్మరాజుపల్లి పాఠశాల వద్ద చెత్తతో బడిపిల్లలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామంలో చెత్త సేకరించకపోవడంతో ప్రజలు చెత్తను పాఠశాల ప్రహరీగోడను ఆనుకుని వేస్తున్నారు. దీంతో చెత్త కుళ్లి దుర్వాసన వస్తోంది. వాహనచోదకులు, బడిపిల్లలు దుర్వాసన భరించాల్సి వస్తోంది.

జలకంఠేశ్వరస్వామికి తిరుమంజనం


ప్రత్యేక అలంకారంలో అమ్మవారు

రామచంద్రాపురం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): రాయలచెరువు కట్ట భవానీ జలకంఠేశ్వరస్వామి, కామాక్షి సమేత కోటిలింగేశ్వరస్వామికి సోమవారం శాస్త్రోక్తంగా తిరుమంజనం జరిగింది. ఆలయంలో విశేష పూజల అనంతరం స్వామి అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ చేపట్టారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ పరిసరాల్లో మహిళలు కార్తిక దీపాలు వెలిగించారు.

రూరల్ డిప్యూటీ ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ


మణిని అభినందిస్తున్న ఇన్‌ఛార్జి ఎంపీడీవో దయాసాగర్, ఏవో రంగనాథం తదితరులు

తిరుపతి రూరల్, డిసెంబరు 1(ఆంధ్ర జ్యోతి): తిరుపతిరూరల్ మండల డిప్యూటీ ఎంపీడీవో(జీఎస్‌డబ్ల్యూఎస్)గా నియమితులైన పీఎస్ మణి సోమవారం బాధ్యతలు చేపట్టారు. తిరుచానూరు గ్రామ పంచాయతీ గ్రేడ్-1 కార్యదర్శిగా పనిచేసే మణిని జిల్లా కలెక్టర్ ఆదేశాలమేరకు పదోన్నతిపై రూరల్ మండల డిప్యూటీ ఎంపీడీవోగా నియమించారు. ఈయన్ను కార్యదర్శిగా రిలీవ్ చేస్తూ ఉత్వర్వులు వెలువరించారు. ఇన్‌ఛార్జి ఎంపీడీవో దయాసాగర్‌ని మర్యాదపూర్వకంగా కలసి బాధ్యతలు స్వీకరించారు. ఇన్‌ఛార్జి ఎంపీడీవోతోపాటు ఏవో రంగనాథం తదితరులు అభినందించారు.

సీఐటీయూ అఖిల భారత మహాసభలను జయప్రదం చేయండి


గోడ పత్రికలను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నేతలు

చంద్రగిరి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): సీఐటీయూ అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని ఆ యూనియన్ జిల్లా అధ్యక్షుడు జయచంద్ర పిలుపునిచ్చారు. సోమవారం చంద్రగిరి టవర్ క్లాక్ వద్ద అఖిల భారత మహాసభల గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జయచంద్ర మాట్లాడుతూ ఈనెల 30 నుంచి జనవరి 4వ తేదీ వరకు విశాఖపట్నంలో జరిగే మహాసభలకు దేశ నలుమూలల నుంచి ప్రతినిధులు 2500 మంది పాల్గొంటారన్నారు. జనవరి 4వ తేదీన విశాఖపట్నంలో జరిగే బహిరంగ సభకు వేలాదిగా తరలివచ్చి జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆప్కాస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు చిన్నబాబు, చంద్రగిరి మండల కన్వీనర్ యుగంధర్, ప్రకాష్, రామ్మూర్తి, పెంచలయ్య, చిరంజీవి, గురురెడ్డి, మల్లికార్జున, నరసింహ, మల్లి తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌సీపురంలో జడివాన


ఆర్‌సీపురంలో కురుస్తున్న వర్షం

రామచంద్రాపురం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివారం రాత్రి నుంచి సోమవారం రాత్రి వరకు జడివాన కురిసింది. శుక్రవారం రాత్రి ప్రారంభమైన జల్లులు కురుస్తూనే ఉన్నాయి. సోమవారం పూర్తిగా వర్షం కురిసింది. మూడు రోజుల వర్షం కారణంతో జనజీవనం అస్తవ్యస్తమైంది. దిత్వా తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. చిన్నపాటి కూలీలు, వ్యాపారస్థులకు పనులు లేకుండా పోయాయి. చెరకు నరుకుడు పనులు ఆగిపోవడంతో కూలీలు సొంత గ్రామాలకు బయలుదేరివెళ్లారు. వర్షం నేపథ్యంలో వ్యవసాయ పనులు పూర్తిగా నిలిచిపోయాయి.

పరిసరాలను శుభ్రం చేసిన విద్యార్థులు

చంద్రగిరి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఎం.కొత్తపల్లెలో అగరాల ప్రభుత్వ పాలిటెక్నిక్ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పరిసరాలను సోమవారం పరిశుభ్రం చేశారు. విద్యార్థులు వారం రోజులపాటు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈసందర్భంగా పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ భక్తవత్సలం మాట్లాడుతూ జాతీయ సేవా పథకం ముఖ్య ఉద్దేశం విద్యార్థి, యువత వ్యక్తిత్వాన్ని, స్వభావాన్ని సేవ ద్వారా విద్య అనే సూత్రంతో అభివృద్ధి చేయటమని తెలిపారు. ఈకార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారి విజయ్‌కుమార్, సాగర్, పుండరీక నాయుడు, జగ్గయ్య నాయుడు, సుబ్రమణ్యం నాయుడు, ఉపాధ్యాయులు, నాన్‌టీచింగ్ స్టాఫ్, విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను వైసీపీ చిన్నాభిన్నం చేసినా

సూపర్ సిక్స్ పథకాలను అమలుచేశాం

● ఎమ్మెల్యే పులివర్తి నాని


బుచ్చినాయుడుపల్లెలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నాని

చంద్రగిరి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసినా ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే పులివర్తి నాని తెలిపారు. సోమవారం చంద్రగిరి మండలం, బుచ్చినాయుడుపల్లె పంచాయతీలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే విచ్చేశారు. పార్టీలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా స్థానిక నాయకులు చూడాలని పేర్కొన్నారు. అనంతరం ఇంటింటికి వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు బాలకృష్ణమూర్తి, ఏఎంసీ చైర్మన్ గౌస్‌బాషా, మాజీ చైర్మన్ ముడిపల్లి సురేష్‌రెడ్డి, సర్పంచ్ రవినాయుడు, మాజీ సర్పంచ్ వేణు, టీడీపీ నాయకులు కన్నయ్యానాయుడు, గ్రామ కమిటీ మాజీ అధ్యక్షుడు మానికొండ సురేష్, సింగిల్‌విండో చైర్మన్ రాజులగారి వినోద్, మండల ప్రధాన కార్యదర్శి కొండూరు ప్రవీణ్‌రాయల్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సహకార సంఘంలో అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు చేపట్టాలి


సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

భాకరాపేట, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని టీడీపీ మండల అధ్యక్షులు బెల్లంకొండ మురళీ, సింగిల్ విండో అధ్యక్షులు ముత్తం ప్రభాకర్ కోరారు. చిన్నగొట్టిగల్లులో సోమవారం వారు మీడియాతో మాట్లాడుతూ 2022-24 మధ్యకాలంలో 1 గ్రామ్ గోల్డు నగలుపెట్టి కె.రెడ్డమ్మ, సి.రుతున్ పేర్లతో రూ.72 లక్షల రుణాలు తీసుకున్నారన్నారు. వాటిని తిరిగి చెల్లించకుండా బుక్ ఆఫ్ అడ్జస్మెంట్ కింద రెన్యూవల్ చేస్తూ వచ్చారన్నారు. 2022 - 25 జూలై వరకు బంగారంపై ఇచ్చిన రుణాల్లో రూ.4,57,21,000వసూలు కాగా రూ.1,60,99,000 మాత్రమే బ్యాంకుకు చెల్లించారన్నారు. మిగిలిన రూ.2,96,00,000లలో రూ.1,33,00,000 విలువైన బంగారు సొసైటీలో ఉందని చూపించారన్నారు. మిగిలిన రూ.1,63,00,000లు బ్యాంకులో జమ చేయకుండా దానికి సంబంధించిన వివరాలు చూపించడం లేదన్నారు. దీనిపై ఇప్పటికే జిల్లా సహకార బ్యాంకు అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. సొసైటీ యాక్టు 1964 సెక్షన్ 51, 52 ప్రకారం డిపార్టుమెంట్ ఎంక్వైరీ జరుపుతున్నారన్నారు. ఈ అక్రమాలకు పాల్పడిన అప్పటి సీఈవో జగదీశ్, అప్రైజర్, పాలకమండలి అధ్యక్షుడు, పర్సన్ ఇన్‌ఛార్జ్‌పై చర్యలు తీసుకోవాలని పోలీసులు, బ్యాంకు అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. అక్రమాలకు పాల్పడినవారిపై పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జ్ శివకుమార్, ప్రధానకార్యదర్శి మదనమోహన, నాయకులు మోహన్ రెడ్డి, సుబ్రహ్మణ్యం, మల్లిఖార్జున రెడ్డి, విజయశేఖర్ గౌడ్, మురళీ తదితరులు పాల్గొన్నారు.

గాంధీపురంలో కాలువ స్థలం చదును

● అడ్డుకున్న రెవెన్యూ అధికారులు


జేసీబీతో చదును చేస్తున్న దృశ్యం

తిరుపతిరూరల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం అవిలాల లెక్కదాఖలా గాంధీపురం పంచాయతీలోని సర్వేనంబరు 11లోని కాలువ స్థలంలో సోమవారం కొందరు జేసీబీ సాయంతో చదును చేసి, ముళ్లచెట్ల తొలగింపు పనులు చేపట్టారు. దీనిపై స్థానికులు పలువురు రూరల్ రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌ఛార్జి తహసీల్దార్ ఎం.మోహన్‌బాబు ఆదేశాల మేరకు స్థానిక రెవెన్యూ అధికారులు స్థలసందర్శన చేసి పనులను అడ్డుకున్నారు. రెవెన్యూ రికార్డుల్లో సర్వేనంబరు 11లో 3.22 ఎకరాల విస్తీర్ణం కాలువభూమిగా నమోదై ఉందని, ప్రభుత్వభూమిలో ఎలాంటి పనులు చేపట్టరాదని వారికి సూచించారు. అయితే గతంలో ఈ భూమిలో తమకు ప్రభుత్వం పట్టాలు ఇచ్చిందని, న్యాయస్థానంలోనూ అనుకూలంగా తీర్పు వచ్చిందని లబ్ధిదారులు పేర్కొన్నారు. దీనికి సంబంధించిన మీవద్దఉన్న పత్రాలను తహసీల్దార్ కార్యాలయంలో సమర్పించాలని, అప్పటివరకు ఈస్థలంలో ఎలాంటి పనులు చేపట్టరాదని నిలుపుదల చేశారు.

పర్యాటకం, పరిశ్రమలతో రాయలసీమ జోన్ అభివృద్ధి

● కూటమి ప్రభుత్వానికి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు

● మంత్రి సత్యప్రసాద్

తిరుపతి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తిరుపతి కేంద్రంగా రాయలసీమ జోన్‌ను ఆధ్యాత్మిక టూరిజం, పరిశ్రమలతో అభివృద్ధి చేస్తామని మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. తిరుపతి నగరం జీవకోనలో సోమవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నాయుడుపేట, సూళ్లూరుపేట వంటి ప్రాంతాల్లో ఎలక్ట్రానిక్స్, ఏరోస్పేస్ పరిశ్రమలను ప్రోత్సహించనున్నట్లు తెలిపారు. తిరుపతి చుట్టుపక్కల నూతన టౌన్‌షిప్‌లు, కన్వెన్షన్ సెంటర్లు, టూరిజం హబ్బులు ఏర్పాటు చేయడానికి క్యాబినెట్ ఆమోదం కూడా లభించినట్టు చెప్పారు. ప్రతినెలా సచివాలయ సిబ్బందితో కలిసి ఇంటింటికీ వెళ్లి పెన్షన్లు అందజేస్తూ పేదల పట్ల కూటమి ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతను చాటుతున్నామన్నారు. ప్రపంచంలో ఎక్కడా ఇలాంటి విస్తృతమైన పెన్షన్ పథకం లేదని తెలిపారు. సామాజిక బాధ్యతతో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పింఛన్లను పేదలకు అందిస్తోందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చెప్పారు. టీటీడీ సభ్యురాలు పనబాక లక్ష్మి, ఏపీజీబీసీ చైర్‌పర్సన్ సుగుణమ్మ, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, తుడా చైర్మన్ దివాకర్‌రెడ్డి, కూటమి నేతలు పసుపులేటి హరిప్రసాద్, ఊకా విజయకుమార్, సామంచి శ్రీనివాస్, రుద్రకోటి సదాశివం, కుమారమ్మ, కార్పొరేటర్లు ఎస్కేబాబు, అనిత, నరసింహాచారి, నరేంద్రనాథ్, కలెక్టర్ వెంకటేశ్వర్, ఇన్చార్జి జేసీ మౌర్య, ట్రైనీ కలెక్టర్ సందీప్ పాల్గొన్నారు. లబ్ధిదారులతో మంత్రి ఆప్యాయంగా మాట్లాడారు.

ఆర్జిత సేవలు, వీఐపీ బ్రేక్ టికెట్ల కొనుగోలుకు భక్తుల పాట్లు

● పనిచేయని పేమెంట్ గేట్‌వే, మాన్యువల్‌గా కేటాయింపు

తిరుమల, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆర్జితసేవలు, వీఐపీ బ్రేక్ దర్శనాల టికెట్ల కొనుగోలుకు భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సాధారణంగా అదనపు ఈవో కార్యాలయంలో సిఫార్సు లేఖలు సమర్పించిన అనంతరం కేటాయింపు మెసెజ్ భక్తుల సెల్‌ఫోన్‌కు వస్తుంది. మెసేజ్‌లోని లింక్ ఆధారంగా పేమెంట్ చేస్తే టికెట్లు డౌన్‌లోడ్ అవుతాయి. అయితే టీటీడీ నుంచి నిర్ధారణ మెసేజ్‌లు భక్తులకు చేరినప్పటికీ పేమెంట్ చేయడంలో ఇబ్బందులు తలెత్తాయి. దీంతో భక్తులు టికెట్లు ఎలా పొందాలో తెలియక కంగారు పడ్డారు. అయితే టెన్షన్ పడాల్సిన అవసరం లేదని, ఎంబీసీ34 లోని కౌంటర్ల ద్వారా మాన్యువల్‌గా పొందవచ్చని సూచన చేశారు. దీంతో భక్తులు వర్షంలోనే ఇబ్బంది పడుతూ క్యూలైన్ల ద్వారా టికెట్లు కొనుగోలు చేయాల్సి వచ్చింది. సర్వర్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తడంతోనే నగదు చెల్లింపులలో ఇబ్బందులు ఎదురయ్యాయని అధికారులు తెలిపారు.

రంగనాథస్వామికి పట్టువస్త్రాల సమర్పణ


పట్టువస్త్రాలతో టీటీడీ చైర్మన్, అధికారులు

తిరుమల, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్రం శ్రీరంగంలోని శ్రీరంగనాథస్వామికి సోమవారం టీటీడీ తరఫున చైర్మన్ బీఆర్ నాయుడు దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయం వద్దకు చేరుకున్న వీరికి శ్రీరంగం ఆలయ జాయింట్ కమిషనర్ శివరామన్, ప్రధానార్చకుడు సుందరభట్టర్ స్వాగతం పలికారు. అనంతరం చైర్మన్ పట్టువస్త్రాలను తలపై పెట్టుకుని ఊరేగింపుగా వెళ్లి స్వామికి సమర్పించారు. దర్శనం అనంతరం ఆలయ అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు. కైశిక ఏకాదశిని పురస్కరించుకుని 2006 నుంచి శ్రీరంగం ఆలయానికి టీటీడీ పట్టువస్త్రాలను సమర్పిస్తోంది. ఈ కార్యక్రమంలో బోర్డు సభ్యుడు నరేష్‌కుమార్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఒంటరి ఏనుగు హల్‌చల్

● నాలుగు పంచాయతీల్లో పంటల ధ్వంసం


ఒంటరి ఏనుగు విరిచేసిన మామిడిచెట్టు కొమ్మలు

కల్లూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలోని తూర్పు విభాగం అటవీ ప్రాంతం నుంచి ఒంటరి ఏనుగు పశ్చిమ విభాగం అటవీ ప్రాంతంలోకి ఆదివారం రాత్రి చేరుకొంది. నాలుగు పంచాయతీల్లో హల్‌చల్ చేసిన ఒంటరి ఏనుగు ఎలాంటి ప్రమాదం లేకుండా నాలుగు రోడ్లను దాటుకుంది. ముందుగా తూర్పు విభాగం అటవీ ప్రాంతంలోని చింతలవంక నుంచి బయలుదేరిన ఒంటరి ఏనుగు జమిలిగుట్ట మార్గంలో పాళెం పంచాయతీలోకి చేరుకొని రైతుల మామిడిచెట్ల కొమ్మలను విరిచేసింది. ఎలకమాను మార్గంలో కల్లూరు-పులిచెర్ల రోడ్డును దాటుకొని కొంగరవారిపల్లి, పూరేడువారిపల్లి, పాతపేట, గంటావారిపల్లి ప్రాంతాల్లో పలు పంటలను, రాతి కూశాలను ధ్వంసం చేసింది. అక్కడ నుంచి పశ్చిమ విభాగం అటవీ ప్రాంతంలోని చేరుకుంది. సోమవారం పగలంతా అడవిలోని గోగులమ్మ వంక సమీపంలో ఒంటరి ఏనుగు సంచరించినట్లు ప్రజలు తెలిపారు.

చిరుత పిల్లల దాడిలో మహిళకు స్వల్ప గాయాలు


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డీఆర్వో రాకేష్‌కుమార్

ఐరాల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పుత్రమద్ది గ్రామం సమీపంలోని అటవీప్రాంతం వద్ద సోమవారం కాంతమ్మ అనే మహిళను చిరుత పిల్లలు గాయపరిచాయి. అటవీశాఖ డీఆర్వో రాకేష్‌కుమార్ వివరాల మేరకు.. కాంతమ్మ అటవీప్రాంతంలో చిరుత పిల్లలను గమనించింది. అవి నీరు తాగి తిరిగి అడవిలోకి వెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా ఆమె భయపడింది. తన వైపు వస్తున్నట్లు భావించి రాయి విసిరింది. దీంతో అవి వెనుతిరిగి వచ్చి దాడి చేశాయి. చిరుత పిల్లలు గోళ్లతో రక్కాయి. దీంతో ఆమె పరిగెత్తుకుని గ్రామానికి చేరుకుంది. చిరుత కనిపిస్తే దాడులు చేయడానికి ప్రయత్నించ వద్దని డీఆర్వో సూచించారు. ఎవరికైన కనిపిస్తే తమకు తెలియజేయాలని కోరారు. ఆయన గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఎఫ్‌బీవోలు నిశ్చల్‌బాబు, లావణ్య, ఏనుగుల ట్రాకర్స్ పాల్గొన్నారు.

ఎస్వీయూ ఫార్మసీ కాలేజీ ప్రిన్సిపాల్‌గా రాజేంద్రప్రసాద్



నియామక ఉత్తర్వులు అందజేస్తున్న రెక్టార్ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు

తిరుపతి (విశ్వవిద్యా లయాలు), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ ఫార్మసీ కాలేజీ ప్రిన్సిపాల్‌గా వై.రాజేంద్రప్రసాద్ నియమితులయ్యారు. ఆంధ్రా యూనివర్సిటీలో బీఫార్మసీ, ఎంఫార్మసీ, పీహెచ్‌డీ పూర్తి చేసి అక్కడే ప్రొఫెసర్‌గా 36 ఏళ్లు పనిచేశారు. ఆంధ్రా వర్సిటీ ఫార్మసీ కాలేజీ ఫ్యాకల్టీ డీన్‌గా, ప్రిన్సిపాల్‌గా సేవలందించారు. 2 పుస్తకాలు, 152 పరిశోధనా వ్యాసాలు ప్రచురితమయ్యాయి. ఆయన పర్యవేక్షణలో 91 మంది పీహెచ్‌డీ పూర్తి చేశారు. ఈ నేపథ్యంలో ఎస్వీయూ ఫార్మసీ కాలేజీ ప్రిన్సిపాల్‌గా నియమిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం బాధ్యతలు స్వీకరించారు.

ఘనంగా గీతా జయంతి



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థినులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పద్మావతి జూనియర్ కాలేజీలో గీతా జయంతి ఘనంగా నిర్వహించారు. ప్రతి ఒక్కరూ భగవద్గీతను చదవాలని ప్రిన్సిపాల్ భువనేశ్వరి కోరారు. ఇస్కాన్ ప్రతినిధులు భగవద్గీతపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. భగవద్గీత పారాయణం చేయించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వోద్యోగులకు రీయింబర్స్‌మెంట్ సౌకర్యం




శ్రీధర్‌ముని

తిరుచానూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): అస్టర్ నారాయణాద్రి ఆస్పత్రిలో రాష్ట్ర ప్రభుత్వోద్యోగులకు రీయింబర్స్‌మెంట్ సౌకర్యం కల్పిస్తున్నట్లు ఆస్పత్రి చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ శ్రీధర్ ముని తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆస్పత్రిలో కొత్తగా ప్రభుత్వ ఉద్యోగులకే కాకుండా వారి కుటుంబ సభ్యులకు రీయింబర్స్‌మెంట్ సౌకర్యం ఏర్పాటు చేశామన్నారు. ఇందుకోసం ప్రత్యేక వైద్య బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నాణ్యమైన వైద్య సేవలే తమ ఆస్పత్రి లక్ష్యమన్నారు.

4న కార్తీక దీపోత్సవం

తిరుపతి(కల్చరల్), డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి) : స్థానిక కోదండ రామాలయంలో ఈ నెల 4వ తేదీన కార్తీక దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు టీటీడీ తెలిపింది. ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహించాల్సిన అష్టోత్తర కలశాభిషేకం, తిరువీధి ఉత్సవాన్ని రద్దు చేస్తున్నట్లు సోమవారం ప్రకటించింది.

బీఎస్ఎన్ఎల్ ప్రిన్సిపుల్ జీఎంగా వెంకటశ్రీకుమార్



తిరుపతి(సెంట్రల్), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): బీఎస్ఎన్ఎల్ తిరుపతి జిల్లా(ఉమ్మడి చిత్తూరు జిల్లా) ప్రిన్సిపుల్ జీఎంగా అల్లాడి వెంకట శ్రీకుమార్‌ను నియమిస్తూ ఉత్తర్వులు వచ్చాయి. ఇక్కడ ఉన్న సి.అమరేంద్ర రెడ్డి నవంబరు 30న ఉద్యోగ విరమణ చేశారు. వెంకట శ్రీకుమార్ తమిళనాడు వేలూరు జిల్లాలో సీజీఎంగా ఉన్నారు. త్వరలోనే ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు.

ఎన్టీఆర్ రక్తనిధికి బెస్ట్ పర్ఫార్మెన్స్ అవార్డు



రక్తనిధి కేంద్ర నిర్వాహకులకు అవార్డు ప్రదానం చేస్తున్న డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్

తిరుపతి(వైద్యం), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఎన్టీఆర్ రక్తనిధి కేంద్రానికి బెస్ట్ పర్ఫార్మెన్స్ అవార్డు దక్కింది. ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా స్థానిక మహతి ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్ అవార్డును ప్రదానం చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన రక్త సరఫరా, శుభ్రమైన వాతావరణం వంటి విషయాల్లో ఎన్టీఆర్ రక్తనిధి కేంద్రం ఆదర్శంగా నిలిచిందన్నారు. ఎన్టీఆర్ ట్రస్టు అడ్మిన్లు జ్యోత్స్న, రవి మాట్లాడుతూ ఎన్టీఆర్ ఆశయాలను కొనసాగించే దిశగా ప్రజల ప్రాణాలను నిలబెట్టేందుకు ఎన్టీఆర్ రక్తనిధి కేంద్రం ఎప్పుడూ ముందంజలో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో రుయా సూపరింటెండెంట్ రాధ, డీఎల్ఏటీపీ శైలజ పాల్గొన్నారు.

శ్రీరామ ఇంజనీరింగ్‌లో అవగాహన సదస్సు



వెంకటరమణయ్యకు పుష్పగుచ్ఛం అందిస్తున్న విద్యార్థి

తిరుపతిరూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కరకంబాడీ రోడ్డులోని శ్రీరామ ఇంజనీరింగ్ కళాశాలలోని మాస్టర్ ఆఫ్ అడ్మినిస్ట్రేటివ్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో సోమవారం క్లైమేట్ రీసైలెంట్ సప్లై చైన్స్‌పై విద్యార్థులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (లక్నో) ప్రొఫెసర్ ఎస్.వెంకటరమణయ్య మాట్లాడుతూ వాతావరణ మార్పులకు అనుగుణంగా సరఫరా వ్యవస్థను బలోపేతం చేసుకోవాలన్నారు. వాతావరణ సంక్షోభం తలెత్తినప్పుడు ఎదుర్కోవాల్సిన అంశాలపై అవగాహన కల్పించారు. చైర్మన్ మన్నెం రామిరెడ్డి, సెక్రటరీ మన్నెం రామసుబ్బారెడ్డి, డైరెక్టర్ మన్నెం అరవింద్‌కుమార్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జయచంద్ర, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.వాసు, హెచ్‌వోడీ, అధ్యాపకులు పాల్గొన్నారు.

రుయా మెడికల్ షాపుల రగడపై మంత్రికి ఫిర్యాదు

తిరుపతి, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి) : ఎస్వీఆర్ రుయా ఆస్పత్రిలో అడ్డగోలుగా కేటాయించిన మెడికల్ షాపుల రగడపై మంత్రి అనగాని సత్యప్రసాద్ దృష్టికి టీడీపీ నేతలు తీసుకెళ్లారు. 44వ డివిజన్ టీడీపీ నాయకుడు ఊట్ల సురేంద్ర నాయుడు సోమవారం మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. తమ డివిజన్‌లోని వైసీపీ నాయకులకు నిబంధనలకు విరుద్ధంగా మెడికల్ షాపులు కట్టబెట్టడం దారుణమన్నారు. దీనిపై కలెక్టర్‌తో చర్చిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

ఫోర్జరీ సంతకాలతో స్థలం కాజేశారు

తిరుపతి(కల్చరల్), డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి) : ఫోర్జరీ సంతకాలతో తమ స్థలాన్ని కాజేశారని, విచారణ జరిపి న్యాయం చేయాలని టి.ఇందిరమ్మ కోరారు. ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆమె మాట్లాడుతూ తన భర్త టి.దశరథరామయ్య 1976లో తిరుపతి శ్రీనివాసపురంలో శ్రీశ్రీనివాస కోఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీలో సర్వేనెంబరు 323లోని ప్లాట్ కొనుగోలు చేసినట్లు చెప్పారు. 116 అంకణాలకు సంబంధించిన ఆ స్థలం పత్రాలు తన వద్ద ఉన్నా కొందరు ఫోర్జరీ సంతకాలతో విక్రయించారని, విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఆమె కుమార్తె రమ్యశ్రీ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతోనే ఎయిడ్స్ నిర్మూలన

డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్







ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్ - సమావేశంలో మాట్లాడుతున్న తేజ వాసిరెడ్డి, సజిత్ మేడిపల్లి - ర్యాలీలో వేద వర్సిటీ విద్యార్థులు, ఉద్యోగులు

తిరుపతి(వైద్యం), డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్‌పై అవగాహన ఉన్నప్పుడే కట్టడి చేయడంతో పాటు నిర్మూలించేందుకు సాధ్యపడుతుందని డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్ అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా సోమవారం ఆయన స్థానిక జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయ ఆవరణలో అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. వైద్య సిబ్బందితో కలిసి మహతి ఆడిటోరియం వరకు ర్యాలీని కొనసాగించారు. మహతి ఆడిటోరియంలో ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల ఆరోగ్య భద్రతలో ప్రతిభ చూపిన వైద్యులకు, ఐసీటీసీ-ఏఆర్టీ కౌన్సిలర్లకు, ల్యాబ్ టెక్నీషియన్లకు, బ్లడ్ బ్యాంక్, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. హైరిస్క్ గర్భిణులకు ఇంటి వద్దకే వెళ్లి హెచ్‌ఐవీ పరీక్షలు నిర్వహించేందుకు అవసరమైన ఐసీటీసీ మొబైల్ వ్యాన్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపల్ రవిప్రభు, రుయా సూపరింటెండెంట్ రాధ పాల్గొన్నారు.

ఈఎస్ఐ ఆస్పత్రిలో..

ఈఎస్ఐ ఆస్పత్రిలో మెడికల్ సూపరింటెండెంట్ శ్యాంబాబు రోగులకు ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. ఎయిడ్స్ పట్ల జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రస్తుతం ఆధునిక మందులు అందుబాటులోకి వచ్చాయని, బాధితులు సాధారణ జీవితం గడపవచ్చునని తెలిపారు.

ఎయిడ్స్ రోగులకు మనోధైర్యం అవసరం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ రోగులు మనో ధైర్యంతో జీవించాలని మెడిగో హాస్పిటల్ ఇన్ఫెక్షన్స్ వైద్య నిపుణురాలు డాక్టర్ తేజ వాసిరెడ్డి పేర్కొన్నారు. పద్మావతి మహిళా యూనివర్సిటీలో సోమవారం చేపట్టిన ఎయిడ్స్ డే కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. క్రమం తప్పకుండా పరీక్షలు, మానసిక ధైర్య ఉంటే ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపవచ్చని తెలిపారు. వ్యాధి నిరోధక శక్తిని దెబ్బతీయడం హెచ్‌ఐవీ మౌళిక లక్షణమని, అనుమానమున్న వారు వెంటనే పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మెడిగో హాస్పిటల్స్ అధినేత డాక్టర్ సజిత్ మేడిపల్లి, వర్సిటీ ఎన్ఎస్ఎస్ అధికారులు లలితకుమారి, మాధవి, పద్మావతి, విశాలి పాల్గొన్నారు.

వేద వర్సిటీలో అవగాహన ర్యాలీ

ఎస్వీ వేద యూనివర్సిటీలో ఎయిడ్స్ అవగాహన ర్యాలీ చేపట్టారు. విద్యార్థులు, ఉద్యోగులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ఎయిడ్స్ గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకొని, సామాన్య ప్రజల్లోనూ అవగాహన కల్పించాలని కోరారు.



మానవహారంగా పద్మావతి డిగ్రీ కాలేజీ విద్యార్థినులు

పద్మావతి డిగ్రీ కాలేజీలో మానవహారం

ఎయిడ్స్ డే సందర్భంగా పద్మావతి డిగ్రీ కాలేజీలో విద్యార్థినులు మానవ హారంగా ఏర్పడి అవగాహన కల్పించే ప్రయత్నం చేశారు. ప్రిన్సిపాల్ నారాయణమ్మ, ఎన్ఎస్ఎస్ అధికారి కృష్ణవేణి పాల్గొని ముందస్తు జాగ్రత్తలతో ఎయిడ్స్‌ను నివారించవచ్చని అభిప్రాయపడ్డారు.

17న అటవీ శాఖలో 370 వాహనాల వేలం





తిరుపతి అటవీ శాఖ కార్యాలయం వద్ద ఉన్న వాహనాలు

మంగళం, డిసెంబర్ 1(ఆంధ్రజ్యోతి): అటవీ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 17న వాహనాలను వేలం వేయనున్నారు. ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ 8 రేంజ్‌లలో పట్టుబడిన 370 వాహనాలను వేలం వేస్తున్నారు. అత్యధికంగా తిరుపతి రేంజ్ నుంచి 160 వాహనాలు వేలం వేస్తున్నారు. ఇందులో ద్విచక్ర వాహనాలు, కార్లు, జీప్‌లు, లారీలు, ఆటోలు, మినీలారీలు ఉన్నాయి. కొనుగోలు చేయాలనుకునే వారు ముందుగా ఆయా రేంజ్‌ల పరిధిలోని అటవీ శాఖ కార్యాలయాలకు వెళ్లి పరిశీలించి, వేలం పాటలో పాల్గొనవచ్చు.

అధిక ధరలే అడ్డంకి..

ఈ సంవత్సరం ఫిబ్రవరిలో తిరుపతి కపిలతీర్థం వద్ద ఉన్న జిల్లా అటవీ శాఖ కార్యాలయం వద్ద 105 వాహనాలను వేలం వేశారు. కేవలం 62మాత్రమే అమ్ముడుపోయాయి. తద్వారా రూ.48లక్షలు లభించింది. ఈసారి 8 రేంజ్‌లలో ఉన్న 900 వాహనాల్లో ఈనెల 17న 370 వేలం వేయడానికి అధికారులు సిద్ధమయ్యారు. అయితే ఆర్టీఏ అధికారులు వీటిని అధిక ధరలు నిర్ణయిస్తుండటంతో కొనుగోలు దారులు ఆసక్తి చూపడం లేదన్న ఆరోపణలున్నాయి. సంవత్సరాల తరబడి మూలన పడేయటం, ఇంజన్, ఇతర కీలక భాగాలు తుప్పు పట్టిపోవడం, కొన్ని పూర్తిగా లేకపోవడంతో మరమ్మతు చేయించుకోవడానికి వేలల్లో ఖర్చవుతోందని గతంలో కొన్న కొనుగోలుదారులు అభిప్రాయపడుతున్నారు. వాహనాల కండిషన్‌ను దృష్టిలో పెట్టుకుని ధర నిర్ణయిస్తే బాగుంటుందని అంటున్నారు. మరి అధికారులు ఏమి చేస్తారో వేచి చూడాల్సి ఉంది.

‘అఖండ2’ త్రిశూల యాత్ర ప్రారంభం

శ్రీకాళహస్తి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి అఖండ 2 సినిమా బృందం ఆ సినిమాలో ఉపయోగించిన త్రిశూలం, ఢమరుకంతో సోమవారం విచ్చేసి దర్శించుకుంది. హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ నటించిన అఖండ 2 ఈనెల 5న విడుదల కానున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో కథానాయకుడు పాత్రధారి ఉపయోగించిన త్రిశూలం, ఢమరుకం సహా పంచ శైవక్షేత్రాలను దర్శించే కార్యక్రమానికి అఖండ బృందం సోమవారం శ్రీకాళహస్తి నుంచి శ్రీకారం చుట్టింది. ముక్కంటి ఆలయం వద్దకు వచ్చిన ఈ బృందానికి టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారి గురవారెడ్డి స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా నందమూరి బాలకృష్ణ హెల్పింగ్ హ్యాండ్స్ అధ్యక్షుడు జగన్‌మోహన్ అఖండ 2 విజయవంతం కావాలని శ్రీకాళహస్తి క్షేత్రాన్ని మొదట సందర్శించామన్నారు. ఇక్కడి నుంచి కంచి, అరుణాచలం, జంబుకేశ్వరం, చిదంబరం ఐదు క్షేత్రాలను పూర్తి చేస్తామన్నారు.



ఆలయంలో త్రిశూలంతో అఖండ బృందం

నందమూరి బాలకృష్ణ అభిమానులు అఖండ బృందంతో కలిసి సెల్ఫీలు దిగేందుకు ఉత్సాహం చూపారు.

మంత్రికి సూపర్ సిక్స్ పథకాల జ్ఞాపికతో సత్కారం

తిరుపతి, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి) : తిరుపతి పర్యటనలో ఉన్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను టీడీపీ నేతలు సూపర్ సిక్స్ జ్ఞాపికతో సత్కరించారు. రేణిగుంట రోడ్డులోని టీడీపీ పార్లమెంటరీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో సోమవారం మంత్రి పాల్గొన్నారు. డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ సూపర్ 6 పథకాలతో ప్రత్యేకంగా తయారు చేయించిన జ్ఞాపికను ఆయనకు బహూకరించారు. సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు సూపర్ 6 కొట్టేశామని, అందుకే ప్రజల వద్దకు ధైర్యంగా వెళ్లగలుగుతున్నామని అనగాని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఏపీజీబీసీ చైర్‌పర్సన్ సుగుణమ్మ, పార్లమెంటు అధ్యక్షుడు నరసింహ యాదవ్, రాష్ట్ర మీడియా కోర్డినేటర్ శ్రీధర్ వర్మ పాల్గొన్నారు.



మంత్రికి జ్ఞాపిక అందజేస్తున్న కూటమి నేతలు

ఇది సంక్షేమ ప్రభుత్వం : టీడీపీ



టీడీపీ నేతలతో కలిసి పింఛన్ పంపిణీ చేస్తున్న పులుగోరు మురళి

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం కృషి చేస్తోందని తిరుపతి టౌన్ బ్యాంకు మాజీ చైర్మన్ పులుగోరు మురళీకృష్ణారెడ్డి అన్నారు. నగరంలోని జబ్బార్ లేఅవుట్, సున్నపు వీధి, మలయాకట్ట, తిలక్ రోడ్డు ప్రాంతాల్లో సోమవారం ఆయన టీడీపీ వార్డు నాయకులు, కార్యకర్తలతో కలసి పింఛన్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఆర్థిక పరిస్థితి సరిగా లేకున్నా సీఎం చంద్రబాబు ప్రతినెలా ఒకటో తేదీన ఉద్యోగులకు జీతాల తరహాలో పింఛన్లు పంపిణీ చేస్తున్నారని తెలిపారు. టీడీపీ పార్లమెంటు అధికార ప్రతినిధి శరత్ చౌదరి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టీడీపీ 26, 27, 32 డివిజన్ల అధ్యక్షులు, ఇన్‌చార్జులు, గెంజి సుధాకర్ రెడ్డి, నాగప్రతాప్, దేవ అచ్చారి, జనసేన డివిజన్ అధ్యక్షుడు కృష్ణయ్య, మునిరాజ, సూరి నారాయణ, ఎస్‌కేడీ నగర్ విజయ్, శంకర పాల్గొన్నారు.

చంద్రగిరి టీడీపీ కార్యాలయాన్ని సందర్శించిన ఇన్‌ఛార్జి మంత్రి

తిరుచానూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): తిరుపతి పర్యటనకు విచ్చేసిన జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ సోమవారం చంద్రగిరి నియోజకవర్గ టీడీపీ కార్యాలయాన్ని సందర్శించారు. ఆయనకు ఎమ్మెల్యే పులివర్తి నాని, కూటమి నాయకులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలను ఎమ్మెల్యే నాని మంత్రికి పరిచయం చేశారు. నియోజకవర్గంలోని పలు రెవెన్యూ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాల గురించి వివరించారు. మంత్రి సానుకూలంగా స్పందించి పరిశీలించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.



చంద్రగిరి టీడీపీ కార్యాలయంలో ఇన్‌ఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, ఎమ్మెల్యే పులివర్తి నాని, పార్టీ నేతలు

తిరుపతిలో 95శాతం పెన్షన్ల పంపిణీ



పెన్షన్లు పంపిణీ చేస్తున్న డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ

తిరుపతి, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి) : నగరపాలక సంస్థ పరిధిలో 95 శాతం పెన్షన్లు పంపిణీ చేశారు. సోమవారం కార్పొరేషన్ సిబ్బందితో కలసి కూటమి నేతలు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ చేశారు. 35వ డివిజన్లో డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ ఆధ్వర్యంలో పెన్షన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు లక్ష్మీ, జగ్గా, మైనం సురేష్, సుజాతమ్మ, సుబ్బు యాదవ్, చంద్రశేఖర్ రెడ్డి, పెంచలయ్య, సుబ్రమణ్యం నాయుడు, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు. 36వ డివిజన్‌లో టీడీపీ పార్లమెంటు అధ్యక్షుడు నరసింహ యాదవ్, తాతయ్యగుంట గంగమ్మ ఆలయ చైర్మన్ మహేష్ యాదవ్, డివిజన్ నాయకులు రవిశంకర్ యాదవ్, ఆవుల శంకర్ యాదవ్, ఆముదాల వెంకటేష్ పాల్గొన్నారు.

రైల్వే డివిజన్ కోసం మంత్రికి వినతి



తిరుపతి, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి కేంద్రంగా బాలాజీ రైల్వే డివిజన్ ఏర్పాటు చేసేందుకు సహకరించాలని మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను సాధనసమితి నాయకులు కోరారు. సోమవారం తిరుపతికి వచ్చిన ఆయనను నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. మంత్రి స్పందిస్తూ సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తానని, కేంద్రంతో ఒప్పించేందుకు కృషి చేస్తానని చెప్పారు. మంత్రిని కలిసిన వారిలో సమితి కన్వీనర్ కుప్పాల గిరిధర్, నూరినేని బుజ్జిబాబు నాయుడు, సి.ఆర్.కె శేషగిరిరావు, సి కృష్ణయ్య, యు.ప్రసాద్‌రావు, నీలేష్‌కుమార్, అనిల్‌కుమార్, టీవీ రావు తదితరులు పాల్గొన్నారు.



ఐఐటీలో కాన్ఫరెన్సును జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న మంత్రి నారాయణ

త్వరలో కొత్త పరిశ్రమలు

● ఐఐటీ కాన్ఫరెన్స్‌లో మంత్రి నారాయణ

ఏర్పేడు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఏపీకి త్వరలో కొత్త పరిశ్రమలు రానున్నాయని, తద్వారా యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని రాష్ట్ర మంత్రి నారాయణ చెప్పారు. ఏర్పేడు వద్ద ఉన్న తిరుపతి ఐఐటీలో 8వ భారతీయ లీన్ కన్‌స్ట్రక్షన్ కాన్ఫరెన్స్‌లో భాగంగా రెండో రోజైన సోమవారం జరిగిన ఇండస్ట్రీ డే సదస్సులో ఆయన మాట్లాడారు. పరిశ్రమలను రాష్ట్రానికి తీసుకురావడానికి సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ ఎంతో కృషిచేస్తున్నారనిచెప్పారు. ప్రతి ఇంటి నుంచీ ఒక పారిశ్రామిక వేత్తను తయారు చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఏపీ ప్రభుత్వం లీన్ కన్‌స్ట్రక్షన్ ప్రక్రియలను అమలు చేసి నిర్మాణరంగంలో సామర్థ్యాన్ని పెంచడం, వ్యర్థాలను తగ్గించడంపై దృష్టి సారిస్తోందన్నారు. ప్రభుత్వం తరపున హాజరైన నిపుణులతో లీన్ కన్‌స్ట్రక్షన్ ఆవిష్కరణలు, ఉత్తమ పద్ధతులపై ఆయన చర్చించారు. విద్యారంగంలోని పరిశోధనలను, పరిశ్రమ అవసరాలతో అనుసంధానం చేయాలనే లక్ష్యమని ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ పేర్కొన్నారు. ఈ ఇండస్ట్రీడే భారత నిర్మాణ రంగ భవిష్యత్తును సుస్థిరంగా తీర్చిదిద్దేందుకు అకడమిక్ కఠోరతను, పరిశ్రమను ఉత్తమంగా మార్చడంలో ఐఐటీ చేస్తున్న ప్రయత్నాలను వివరించారు. పారిశ్రామికవేత్త అనుప్ మాథ్యూ, ఐఎల్‌సీఈ సెక్రటరీ జనరల్ కైజాద్ కరంజావాలా తమ అభిప్రాయాలను పంచుకున్నారు.


సర్వ దర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 4 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 19 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.4.47 కోట్లు

ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 68,187

తలనీలాలు సమర్పించినవారు: 25,027





నీటి ఏనుగు



అడవి జింక



విదేశాల నుంచి తెచ్చిన మీర్‌కాట్ పిల్లలు



బూడిదరంగు కోళ్లు



చుక్కల దుప్పి పిల్లలు



అడవిపందులు



అడవిదున్న



థామిన్ జింక

కొత్త ప్రాణులకు పురుడుపోస్తున్న జూపార్కు

ఆసియా ఖండంలో అతిపెద్దదైన శ్రీవేంకటేశ్వర జూపార్కులో జంతు సంతతి క్రమంగా పెరుగుతోంది. 85రకాల వన్యప్రాణులున్న తిరుపతి జూలో వయసు, అనారోగ్య కారణాలతో కొన్ని మృతి చెందుతున్నాయి. మరోవైపు ఉన్న వన్యప్రాణులు కొత్తవాటికి జన్మనిస్తూ సంతతిని పెంచుకుంటున్నాయి. ఇతర దేశాల నుంచి తీసుకువచ్చినవి, మనదేశంలోని ఇతర జూల నుంచి తీసుకువచ్చిన వన్యప్రాణుల్లో మీర్‌కాట్, అడవి దున్న, బూడిదరంగు అడవి కోడి, నీటి ఏనుగు, అడవి జింక, అడవి పంది, చుక్కల దుప్పి, థామిన్ జింక వంటివి ఇక్కడే సంతానాన్ని వృద్ధి చేసుకున్నాయి. ఇతర దేశాల నుంచి వచ్చి ఇక్కడి వాతావరణంలో ఇమడలేని కొన్ని ప్రాణులు మరణించాయని, రెండు నెలలలోనే మరి కొన్ని ఇక్కడే కొత్తవాటికి జన్మనిచ్చాయని తిరుపతి జూపార్క్ అసిస్టెంట్ క్యూరేటర్ జగదీష్ చంద్రప్రసాద్ తెలిపారు. ఇక్కడే పుట్టిన ప్రాణులు ఈ వాతావరణానికి అలవాటు పడినట్లే. అవి ఆరోగ్యంగా పెరుగుతాయి. అని ఆయన చెప్పారు. ఇతర జూల నుంచి వచ్చిన వాటి కోసం కొత్త ఎన్‌క్లోజర్‌లు సిద్ధం చేస్తున్నామని చంద్రప్రసాద్ తెలిపారు.

- మంగళం, ఆంధ్రజ్యోతి

పాపవినాశనం డ్యాం ఎంత భద్రం?

● అధ్యయనం చేస్తున్న కేంద్ర శాస్త్రవేత్తలు

తిరుమల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తిరుమలలోని పాపినాశనం డ్యాం పటిష్టత ఏ స్థితిలో ఉందో కేంద్ర ప్రభుత్వ సంస్థ సాయిల్ అండ్ మెటీరియల్ రిసెర్చ్ స్టేషన్ (సీఎస్ఎంఆర్ఎస్) శాస్త్రవేత్తల బృందం పరిశీలిస్తోంది. 42 ఏళ్ల కిందట తిరుమల నీటి అవసరాల కోసం నిర్మించిన ఈ డ్యామ్ భద్రతపై టీటీడీ దృష్టి పెట్టింది. ఏపీ జనవరులశాఖ సలహాదారు కన్నయ్య నాయుడు కూడా ఈ ఏడాది ఫిబ్రవరిలో పాపినాశనం డ్యాంను పరిశీలించారు. డ్యాం గేట్లలో కొన్ని భాగాలు దెబ్బతిన్నాయని, మరమ్మతులు చేస్తే మరో 30 ఏళ్ల దాకా ఇబ్బంది లేదని సలహా ఇచ్చారు. అలాగే నేషనల్ డ్యాం సేఫ్టీ యాక్ట్ కింద కేంద్ర జలశక్తి విభాగానికి చెందిన సీఎస్ఎంఆర్ఎస్ ను అధ్యయనం చేయాల్సిందిగా టీటీడీ కోరింది. ఇందులో భాగంగా నవంబరు 26 నుంచి జలవనరుల శాఖ సీఈ వరప్రసాద్, ఎస్ఈ రాధాకృష్ణమూర్తి, ఈఈ రవిశంకర్‌రెడ్డి, టీటీడీ ఈఈ సుధాకర్ ఆధ్వర్యంలో సీఎస్ఎంఆర్ఎస్ శాస్త్రవేత్తలు సెంథిల్, జాలె లింగేస్వామి, దీపక్‌కుమార్ శర్మ బృందం పాపవిశానం డ్యాంను పరిశీలిస్తోంది. డ్యాములో నీటి కిందభాగానికి రిమోట్ ద్వారా ఒక యంత్రాన్ని పంపారు. కిందభాగంలోని పలు ప్రాంతాల్లో ఫొటోలను తీస్తున్నారు. డ్యాం అడుగుభాగం ఎంత పటిష్టంగా ఉందో దీనిద్వారా నిర్ధారించుకుంటారు. మరో రెండు రోజుల్లో పరిశీలనను పూర్తిచేసి నివేదికను రాష్ట్ర జలవనరుల శాఖ విభాగానికి అందజేయనున్నారు.

తిరుమలలో 5 డ్యాములు: తిరుమల కొండపై ప్రస్తుతం ఐదు డ్యాములు ఉన్నాయి. 1963లో గోగర్భం డ్యామును నిర్మించింది. ఆతర్వాత భక్తుల సంఖ్య పెరగడంతో 1983లో పాపవినాశనం డ్యామును నిర్మించారు. 2002లో ఆకాశగంగ, 2011లో జంటప్రాజెక్టులుగా పిలిచే కుమారధార, పసుపుధార డ్యాములను నిర్మించారు. వీటి మొత్తం నిల్వ సామర్థ్యం 14,303 లక్షల గ్యాలన్లు.





పాపవినాశనం డ్యాం వద్ద సీఎస్ఎంఆర్ఎస్ బృందం - నీటిలోకి పంపుతున్న రిమోట్ ఆపరేట్ వెహికల్

డయల్ యువర్ సీఎండీకి 62 వినతులు



వినియోగదారుల సమస్యలు వింటున్న సీఎండీ శివశంకర్

తిరుపతి(ఆటోనగర్), డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): తిరుపతి కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ ఎస్పీడీసీఎల్ సీఎండీ కార్యక్రమానికి 62 వినతులు వచ్చాయి. ఉదయం 10 నుంచి 12 గంటల వరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో 9 జిల్లాల నుంచి వినియోగదారులు ఫోన్ ద్వారా తమ సమస్యలను సీఎండీ లోతేటి శివశంకర్ దృష్టికి తెచ్చారు. వ్యవసాయ విద్యుత్ సర్వీసుల మంజూరులో జాప్యం, కాలిన, చోరీకి గురైన ట్రాన్స్‌ఫార్మర్లు త్వరగా మార్చాలని, విద్యుత్ లైన్లు మార్పు చేయాలని, లోఓల్టేజ్ సమస్యలు పరిష్కరించాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు వస్తున్నాయని ఫిర్యాదు చేశారు. వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని సీఎండీ హామీ ఇచ్చారు. గతనెల 24వ తేదీ వరకు వచ్చిన 265 ఫిర్యాదుల్లో 118 పరిష్కరించామన్నారు. వినియోగదారులు సమస్యలను టోల్ ఫ్రీ నెంబర్లు 1912, 1800 425155333కి కాల్ చేసి, సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. అలాగే 9133331912కు చాట్‌చేస్తే పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు కె.గురవయ్య, పి.అయూబ్‌ఖాన్, కె.రామమోహనరావు, చీఫ్ జనరల్ మేనేజర్లు జె.రమణాదేవి, ఎన్.శోబావాలంటీనా, పి.హెచ్.జానకిరామ్, ఎం.మురళీకుమార్, పి.సురేంద్ర నాయుడు, కె.ఆదిశేషయ్య, ఎం.ఉమాపతి, జీఎంలు జి.చక్రపాణి, ఎం.కృష్ణారెడ్డి, రాజశేఖర్ రెడ్డి, డి.సురేంద్రరావు, పి.భాస్కర్‌రెడ్డి, ప్రసాద్, వెంకటరాజు, విజయన్ పాల్గొన్నారు.

'గూడూరు' సమస్య పరిశీలించండి

● మంత్రి అనగానికి ఎమ్మెల్యే సునీల్ వినతి
● సత్యవేడులో ఇన్‌చార్జి చెప్పినట్లు వినాల్సిందేనన్న అనగాని
● తిరుపతిలో టీడీపీ శ్రేణులు, ప్రజల నుంచి విజ్ఞప్తుల స్వీకరణ

తిరుపతి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): తిరుపతికి సుమారు మూడు నెలల తర్వాత సోమవారం వచ్చిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ బిజీబిజీగా గడిపారు. ఉదయం జీవకోనలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో పాల్గొన్న ఆయన రేణిగుంట రోడ్డులోని టీడీపీ పార్లమెంటు కార్యాలయానికి చేరుకున్నారు. ఆ పార్టీ నేతలు, శ్రేణులు, ప్రజలను కలుసుకున్నారు. గూడూరు నియోజకవర్గాన్ని తిరిగి నెల్లూరుజిల్లాలో విలీనంచేసేఅంశాన్ని పరిశీలించాలని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ మంత్రిని అభ్యర్థించారు. పలువురు నాయకులతో కలసి బృందంగా వచ్చిన ఆయన మంత్రి ఎదుట తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై చంద్రబాబు, లోకేశ్ ఎన్నికల్లో హామీలిచ్చారని గుర్తుచేశారు. మంత్రుల ఉపసంఘం తొలుత చేసిన సిఫారసుల్లో గూడూరు విలీనం అంశంఉందని, తీరా ప్రభుత్వం నిర్ణయం తీసుకునే సమయంలో దాన్ని పక్కన పెట్టిందని వాపోయారు. పార్టీ శ్రేణులతో పాటు ప్రజలంతా తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారు. ఈ అంశాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి..తిరిగి నెల్లూరులో విలీనం చేసేలా ఒప్పించాలని కోరారు. మంత్రికి వినతిపత్రం కూడా అందజేశారు.

వైసీపీ నుంచీ వచ్చిన వారికే ప్రాధాన్యం: సత్యవేడు నియోజకవర్గంలోని సత్యవేడు, పిచ్చాటూరు, నాగలాపురం మండలాల నుంచి పలువురు కార్యకర్తలు మంత్రిని కలిశారు. వైసీపీనుంచీ వచ్చినవారికే పనులు జరుగుతున్నాయని, సమన్వయకర్త వారినే వెంటపెట్టుకుని ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించారు. 'ఎన్నికల ముందు పార్టీలోకి వచ్చి, పనిచేసినవైసీపీవారికి ప్రాధాన్యం ఇవ్వాల్సిందే. ఎన్నికల తర్వాత చేరిన వారికి ఎలాంటి ప్రాధాన్యత ఇచ్చేది లేదు. అధిష్ఠానం సమన్వయకర్తగా నియమించిన శంకర్‌రెడ్డిమాటకే పార్టీలో విలువ ఉంటుంది. శ్రేణులు ఆయన్ను అనుసరించుకుని వెళ్లాలి. నానియోజకవర్గంలోనూ ఇలాంటి సమస్య ఉంది. నేనూ అధిష్ఠానం ఆదేశాల్ని గౌరవించి అందరినీ కలుపుకొని పోతున్నా' అని మంత్రి సమాధానమిచ్చారు.

కార్పొరేటర్ అన్నా సంధ్యకు పరామర్శ: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కోలుకుంటున్న జీవకోన కార్పొరేటర్ అన్నా సంధ్య ఇంటికెళ్లి మంత్రి అనగాని సత్యప్రసాద్ పరామర్శించారు. ఆరోగ్యం ఎలా ఉందంటూ వాకబు చేశారు. పార్టీతో పాటు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

టీడీపీ కార్యాలయానికి స్థల పరిశీలన: తిరుపతి రూరల్ మండలం వేదాంతపురం పంచాయతీ పరిధిలో టీడీపీ పార్లమెంటు కార్యాలయ భవనానికి ఇటీవల ప్రభుత్వం కేటాయించిన భూమిని మంత్రి అనగాని పరిశీలించారు. అనంతరం చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని కార్యాలయానికి చేరుకుని నేతలను కలుసుకున్నారు. రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ పనసులేటి హరిప్రసాద్ నివాసానికీ మంత్రి వెళ్లారు. మంత్రిని కలిసిన వారిలో తిరుపతి, శ్రీకాళహస్తి, చంద్రగిరి ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, బొజ్జల సుధీర్‌రెడ్డి, పులివర్తి నాని, వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు జి.నరసింహ యాదవ్, సుగుణమ్మ, తుడా ఛైర్మన్ డాలర్ దివాకర్‌రెడ్డి, సత్యవేడు టీడీపీ ఇంఛార్జి శంకర్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, మీడియా కో ఆర్డినేటర్ శ్రీధర్ వర్మ, గంగమ్మ గుడి ఛైర్మన్ మహేశ్ యాదవ్, కార్పొరేటర్లు అన్నా అనిత, నరసింహాచారి, ఎస్కే బాబు, నరేంద్ర, నేతలు మబ్బు దేవనారాయణరెడ్డి, పులుగోరు మురళి, జేబీ శ్రీనివాస్ తదితరులున్నారు.



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే పాశిం

ఇద్దరు 'ఎర్ర' స్మగ్లర్లకు ఐదేళ్ల జైలు

● రూ.ఆరు లక్షల జరిమానా



నిందితులను జైలుకు తరలిస్తున్న పోలీసులు

తిరుపతి (నేరవిభాగం), డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో ఇద్దరు ఎర్రచందనం స్మగ్లర్లకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.6 లక్షల చొప్పున జరిమానా విధిస్తూ సోమవారం రాష్ట్ర ఎర్రచందనం ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి నరసింహమూర్తి తీర్పు చెప్పారు. చిత్తూరు ఎస్పీ తుషార్ దూడి కథనం మేరకు.. చిత్తూరు జిల్లా సదుం మండలం బోరగమందకు చెందిన పి.వెంకటరమణ, ఆ మండలానికే చెందిన మల్లెల హరినాథ్ 2018లో రొంపిచెర్ల పోలీసు స్టేషన్ పరిధిలో ఎర్రచందనం దుంగలు తరలిస్తుండగా అప్పటి పోలీసులు దాడిచేసి పట్టుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. ఈ కేసులో వారు బెయిల్‌పై బయటకు వచ్చారు. అనంతరం ప్రభుత్వ ఆదేశాల మేరకు కేసును చిత్తూరు జిల్లా నుంచి తిరుపతి ఎర్రచందనం ప్రత్యేక కోర్టుకు బదలాయించారు. కొన్ని నెలలుగా ఇక్కడ కేసు విచారణ జరిగింది. కేసుకు సంబంధించి చిత్తూరు డీఎస్పీ సాయినాథ్, ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ అమరనారాయణ, అప్పటి రొంపిచెర్ల ఎస్ఐ జయరాంనాయక్, ప్రస్తుత ఎస్ఐ హరిప్రసాద్, కోర్టు లైజనింగ్ కానిస్టేబుల్ రవి, నిందితులకు సంబంధించి సాక్ష్యాధారాలు కోర్టు ఎదుట సాక్ష్యాధారాలు హాజరుపరచారు. ఇరువర్గాల వాదనలు విన్న న్యాయమూర్తి.. నిందితులకు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

నకిలీ సీఐ అరెస్ట్



శివకుమార్‌ను అరెస్టు చూపుతున్న పోలీసులు

భాకరాపేట, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): భార్యాభర్తల మధ్య విభేదాలను ఆసరాగా చేసుకుని సీఐ అవతారంలో బెదిరించిన శివకుమార్‌ను అరెస్టు చేసినట్లు భాకరాపేట సీఐ ఇమ్రాన్ బాషా తెలిపారు. ఆయన వివరాల మేరకు.. చిన్నగొట్టిగల్లు మండలం జంగావాండ్లపల్లె పంచాయతీ అప్పేపల్లెకు చెందిన రెడ్డి ఈశ్వర్, భానుశ్రీ దంపతుల మధ్య విభేదాలు తలెత్తాయి. భానుశ్రీ తరపున కేవీపల్లె మండలం చిన్నకమ్మపల్లెకు చెందిన శివకుమార్ తాను కడప స్పెషల్ బ్రాంచ్ సీఐగా పనిచేస్తున్నానని, భానుశ్రీని వేధిస్తే చర్యలు తప్పవని రెడ్డి ఈశ్వర్‌ను బెదిరించాడు. దీంతో శివకుమార్‌పై రెడ్డి ఈశ్వర్ భాకరాపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టి శివకుమార్ సీఐ కాదని నిర్ధారించుకుని అతని కోసం గాలింపు చేపట్టారు. భాకరాపేట సమీపంలోని మామా బావమరిది హోటల్ సమీపంలో సోమవారం అతన్ని అరెస్టు చేశారు. శివకుమార్ ఇంతకు ముందు ఉద్యోగం తీసిస్తానని కలకడ మండలానికి చెందిన అంజినేయులు దగ్గర రూ.8 లక్షలు తీసుకుని మోసం చేసినట్లు సీఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రాఘవేంద్ర, ట్రైనీ ఎస్ఐ రాఘవరెడ్డి పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు



కౌశల్



గౌతమ్ రాజు

తిరుమల, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. సినీనటులు గౌతమ్ రాజు, కౌశల్, తెలంగాణ మాజీ మంత్రి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడి ఉన్నారు.

ప్రొటోకాల్ పాటించరా?

● సురుటుపల్లి ఆలయ ఈవోపై ఎమ్మెల్యే ఆదిమూలం ఆగ్రహం

నాగలాపురం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం, అధికారులకు మధ్య ప్రొటోకాల్ రగడ ముదురుతోంది. నాగలాపురం మండలం సురుటుపల్లిలోని పళ్లికొండేశ్వర ఆలయంలో ప్రొటోకాల్ పాటించడం లేదంటూ ఈవో లతపై సోమవారం ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తంచేశారు. రెండు రోజుల క్రితం ఆలయంలో శని ప్రదోష పూజల నిమిత్తం ముద్రించిన కరపత్రాల్లో స్థానిక ఎమ్మెల్యే ఆదిమూలం పేరు లేదంటూ కొందరు వాట్సాప్ గ్రూపులో పోస్టు చేశారు. ఈ క్రమంలో సోమవారం ఆలయంలోని ఈవో కార్యాలయానికి ఎమ్మెల్యే చేరుకుని ప్రొటోకాల్‌పై నిలదీశారు. ఈవో వ్యవహార శైలిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశానని, అసెంబ్లీలోనూ ఈ అంశాన్ని ప్రస్తావిస్తానని చెప్పారు. రాజకీయాలకు ప్రాధాన్యమిస్తూ ఆలయ ప్రతిష్ఠను దెబ్బతీస్తున్నారంటూ విమర్శించారు. పాలకమండలి ఆత్మీయ సమావేశం పేరుతో ఆలయంలో పార్టీ సమావేశాన్ని నిర్వహించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఆలయ ట్రస్టు బోర్డు నియామకం నియమ నిబంధనలకు వ్యతిరేకంగా జరిగిందని ఆరోపించారు. రేషన్ బియ్యం అక్రమ రవాణా కేసులో నిందితుడికి, మద్యం వ్యాపారాలు చేసుకుంటున్న వ్యక్తికి ఛైర్మన్‌గా ఎలా చోటు కల్పిస్తారని నిలదీశారు. గతంలో టీటీడీలో బంగారు నగల దొంగతనం కేసులో నిందితుడిని.. చెన్నైలో స్థిర నివాసమున్న మహిళను సభ్యులుగా ఎలా నియమిస్తారని ప్రశ్నించారు. బోర్డు నిబంధనల మేరకు గిరిజనులకు ఎందుకు చోటు కల్పించలేదని అడిగారు. ప్రొటోకాల్ విషయమై దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డికి ఫోన్ చేసి చెప్పారు. తగిన ఆధారాలతో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయాలని మంత్రి సూచించినట్లు సమాచారం. కాగా, నూతన సంవత్సరంలో శివయ్య ఎలాఅనుగ్రహిస్తే అలా నిర్ణయం తీసుకుంటానని ఈ సందర్భంగా ఆదిమూలం పేర్కొనడం గమనార్హం. టీడీపీ నాయకులు మురళి, ఎస్ఎం సురేష్, మురళి, సర్పంచ్ కాంతమ్మ, సుబ్రహ్మణ్యం, అంబేడ్కర్ సంఘ నాయకుడు జై భీమ్ అధ్యక్షుడు ధన తదితరులు పాల్గొన్నారు.



ఆలయంలోని కార్యాలయంలో ఈవోని నిలదీస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

ఛైర్మన్ చెబితేనే చేశా: ఈవో

ఆలయ కరపత్రాలపై ఎమ్మెల్యే పేరును ముద్రించకపోవడంపై ఈవో లత వివరణ ఇస్తూ... ఛైర్మన్ చెబితేనే చేశానన్నారు. ఒకసారికి క్షమించాలని ఇంకెప్పుడు ఇలాంటి ఘటన పునరావృత్తం కాకుండా చూసుకుంటానంటూ ఎమ్మెల్యేకి చెప్పారు. 'ఆలయాలకు ఛైర్మన్లు వస్తారు పోతారు. ఇక్కడ భక్తుల సేవే పరమావధిగా ఉండాలి. ఛైర్మన్ చెబితే తరతరాలుగా ఉభయదారులుగా వ్యవహరిస్తున్న వారిని కూడా మార్చేస్తారా?' అంటూ ఈవో ఆగ్రహం వ్యక్తంచేశారు.

వ్యవసాయశాఖ కార్యాలయంలో చోరీ యత్నం



వ్యవసాయశాఖ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

సూళ్లూరుపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట తహసీల్దార్ కార్యాలయ సమీపంలో ఉన్న వ్యవసాయశాఖ కార్యాలయంలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తాళాలు పగలగొట్టి చోరీకి యత్నించారు. సోమవారం ఉదయం కార్యాలయానికి వచ్చిన ఏవో కాంచన, సిబ్బంది తలుపు తాళాలు పగలగొట్టి ఉండడంతో పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. కార్యాలయంలో ఉన్న కంప్యూటర్లు, ఇతర విలువైన వస్తు సామగ్రి అలాగే ఉన్నాయి. దొంగలు చోరీకి యత్నించి వెనుదిరిగి వెళ్లి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నకిలీ విత్తనాలతో మోసపోయాం
న్యాయం చేయండి



ఎస్‌ఐ బ్రహ్మనాయుడికి ఫిర్యాదు చేస్తున్న రైతులు

సూళ్లూరుపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నకిలీ విత్తనాలతో మోసపోయాం... మాకు న్యాయం చేయండి అంటూ సోమవారం రైతులు ఎమ్మెల్యే నెలవల విజయశ్రీని కలిసి వినతిపత్రం అందజేశారు. మేలు రకం విత్తనాలంటూ నమ్మించి విక్రయించారని, నాటిన 20 రోజులకే వెన్ను తీసి పంట నాశనమయ్యే పరిస్థితికి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు నష్టపరిహారం వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు. అనంతరం రైతులు బీజేపీ నాయకుడు ఆరణి విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో వ్యవసాయాధికారి కాంచనకు వినతిపత్రం అందజేశారు. అలాగే ఎస్‌ఐకి ఫిర్యాదు చేశారు.

ఎయిడ్స్ రహిత సమాజానికి కృషి



కార్యక్రమంలో న్యాయమూర్తులు వెంకటనాగపవన్, సులోచనారాణి

గూడూరు అర్బన్, డిసెంబరు (ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన పెంచుకుని హెచ్‌ఐవీ రహిత సమాజానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఏడవ అదనపు జిల్లా జడ్జి వెంకటనాగపవన్ అన్నారు. సోమవారం స్థానిక కోర్టు ఆవరణలో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ ఎయిడ్స్ నిర్మూలన దినం సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ ఎయిడ్స్ ప్రబలకుండా తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. మందులు, పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో న్యాయమూర్తి సులోచనారాణి, అరవ పార్వతయ్య, రజనీకాంత్‌రెడ్డి, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాల్లో ఆర్డీవో పర్యటన



వెదురుపట్టు రోడ్డులో పాలకాలువ వంతెనను పరిశీలిస్తున్న ఆర్డీవో కిరణ్మయి, తహసీల్దారు శైలాకుమారి

దొరవారిసత్రం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆర్డీవో కిరణ్మయి దొరవారి సత్రం మండలంలోని లోతట్టు ప్రాంతాల్లో సోమవారం పర్యటించారు. తనియాలి వద్ద కాళంగి నదిపై వంతెనను, వెదురుపట్టు రోడ్డులోని పాలకాలువ వంతెన, పూలతోట సమీపంలోని కన్నాకాలువ వంతెనను పరిశీలించారు. దిత్వా తుఫాన్ ప్రభావంతో వర్షాలు అధికమైతే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. ఆమె వెంట తహసీల్దారు శైలకుమారి, ఎంపీడీవో గోవర్ధన్, ఎస్‌ఐ అజయ్‌కుమార్, ఇరిగేషన్ ఏఈ హరికృష్ణ తదితరులు ఉన్నారు.

చేనేత కార్మికులకు సాయం అందించాలి

గూడూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురుస్తున్న వర్షాలకు మగ్గం గుంటల్లో నీరు చేరడంతో పనులు లేక ఇబ్బందులు పడుతున్నామని, ప్రభుత్వం ఆదుకోవాలని చేనేత కార్మిక సంఘం నాయకుడు శ్రీనివాసులు కోరారు. నియోజకవర్గంలోని చెన్నూరు, విందూరు, రెట్టపల్లి తదితర గ్రామాల్లో వర్షాల కారణంగా మగ్గం గుంటల్లోకి నీరు చేరడంతో పట్టు, గొడుగు, జరి దెబ్బతిని నష్టపోయామన్నారు. ప్రభుత్వం స్పందించి నష్టపోయిన చేనేత కార్మికులను ఆదుకోవడంతో పాటు బియ్యం, నిత్యావసరాలను అందజేయాలని కోరారు.

తీరప్రాంత గ్రామాల్లో ముందస్తు చర్యలు



పాచ్చూరు గ్రామం వద్ద మామిడికాలువ రహదారిపై రాకపోకలను ఆపేస్తూ కంపచెట్లను అడ్డుగా వేయిస్తున్న తహసీల్దార్ హరికృష్ణ

పెళ్లకూరు, డిశంబరు 30 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో తహసీల్దార్ హరికృష్ణ పలుశాఖల అధికారులతో కలిసి స్వర్ణముఖినది లోతట్టు గ్రామాల్లో పర్యటించారు. మామిడి కాలువ, పాలచ్చూరు కాలువలు, వాగులు పొంగి పొర్లే అవకాశం ఉన్నందున ప్రజలను అప్రమత్తం చేశారు. కలవకూరు, కప్పగుంటకండ్రిగ, పాలచ్చూరు గ్రామాల వద్ద స్వర్ణముఖినది, మామిడి కాలువ కాజ్‌వేలను తహసీల్దార్‌తో పాటు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మనోజ్‌కుమార్ పరిశీలించారు. పాలచ్చూరు ఆనకట్ట, మామిడికాలువ రహదారులపై రాకపోకలను ఆపేశారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

అల్లుడిపై అత్త దాడి

గూడూరు అర్బన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అల్లుడిపై అత్త దాడి చేసిన ఘటన స్థానిక ఇందిరానగర్‌లో సోమవారం చోటు చేసుకుంది. రెండో పట్టణ పోలీసుల వివరాల మేరకు... ఇందిరానగర్‌లో నివాసం ఉంటున్న రాజాకు అతని భార్యతో స్వల్పవివాదం ఏర్పడింది. అదే సమయంలో ఇంట్లో ఉన్న అత్త సుధారాణి కాగుతున్న నూనెను రాజా ఒంటిపై పోయడంతో ఆయనకు గాయాలపాలయ్యాయి. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

గూడూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో 49 మందికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.27.95లక్షలు మంజూరయ్యాయి. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో నెలబల్లి భాస్కర్‌రెడ్డి, దశరథరామిరెడ్డి, వెంకటేశ్వర్లురాజు, పులిమి శ్రీనివాసులు, అబ్దుల్‌రహీం, జలీల్, కిషోర్‌నాయుడు, మట్టం శ్రావణి, తీగల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి అనగానికి సన్మానం



మంత్రి సత్యప్రసాద్‌ను సన్మానిస్తున్న నెలవల సుబ్రహ్మణ్యం

నాయుడుపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రెవెన్యూశాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం సన్మానించారు. సోమవారం తిరుపతిలో మంత్రిని కలిసిన నెలవల సుబ్రహ్మణ్యం నియోజకవర్గ అభివృద్ధి పనులపై చర్చించారు.

ధాన్యం లారీ బోల్తా



నాయుడుపేట టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - మేనకూరు పారిశ్రామికవాడ సమీపంలోని చలివేంద్ర వద్ద ధాన్యం లారీ బోల్తా పడింది. సోమవారం కడప జిల్లా బద్వేలు నుంచి చెన్నైకు ధాన్యం లోడుతో వెళ్తున్న లారీ మేనకూరు సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్ సురక్షితంగా బయటపడ్డారు.

ప్రభుత్వ స్థలాలను పరిరక్షించండి

వెంకటగిరి, డిసెంబర్ 1(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి పట్టణంలోని హ్యాండ్లూమ్స్ టెక్నాలజీ సమీపంలోని చెవిరెడ్డిపల్లి ప్రాంతంతో కోట్లాది రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూమి కబ్జా యత్నాలు జరుగుతున్నాయని 14వ వార్డు కౌన్సిలర్ ఆరి శంకరయ్య అన్నారు. సోమవారం ఆయన తహసీల్దారు నరసింహారావును కలిసి ఫిర్యాదు చేశారు. చెవిరెడ్డిపల్లి సర్వే నంబర్ 96లో సుమారు 4.5 ఎకరాల ప్రభుత్వ భూమిని కొందరు వ్యక్తులు సొంతం చేసుకోనేదానికి ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ఆ భూమిని పరిరక్షించి పార్కు ఏర్పాటు చేయాలని కోరారు.

ఎడ తెరపిలేని ముసురు

సూళ్లూరుపేట, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ ప్రభావంతో రెండు రోజులనుంచి ముసురు పట్టినట్లుగా వర్షం కురుస్తోంది. సోమవారం ఉదయం నుంచి తేలికపాటి జల్లులతో కూడిన వర్షం కురవగా మధ్యాహ్నం నుంచి ముసురు కొనసాగింది. దీనికి చలుగాలులు తోడవడంతో జనం ఇబ్బందులు పడ్డారు. వీడని వర్షంతో కాళంగి నదికి నీరు చేరింది. నెర్రికాలువ, పాముల కాలువల ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.

వెంకటగిరి టౌన్: తుఫాన్ ప్రభావంతో మూడు రోజులుగా ఎడ తెరపి లేకుండా వర్షం కురుస్తోంది. అధికారులు లోతట్టు ప్రాంతాల్లో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు చేరవేశారు. మండలంలోని అన్ని చెరువుల్లో నీరు చేరింది. రైతులు వరి నారుమళ్ల పనుల్లో నిమగ్నమయ్యారు. మగ్గం గుంతల్లో నీరు చేరడంతో ఉత్పత్తి నిలిచిపోయింది.

తడ: మండలంలో ముసురుపట్టింది. శనివారం నుంచి కురుస్తున్న మోస్తరు వర్షం సోమవారం కూడా కొనసాగింది. వర్షానికి చలిగాలులు తోడవడంతో జనజీవనానికి కొంత ఆటంకం ఏర్పడింది.

నాయుడుపేట: మండలంలో చల్లటి ఈదురుగాలులతో అడప దడపా వర్షం కురుస్తోంది. ఉంది. వీధులన్నీ చిత్తడిగా మారాయి. స్వర్ణముఖినది, మామిడి కాలువల్లో వరద ప్రవాహాన్ని తహసీల్దారు రాజేంద్ర, ఎంపీడీవో సురేష్‌బాబు పరిశీలించారు.

వరద ప్రభావిత ప్రాంతాల పరిశీలన

చిట్టమూరు, డిసెంబర్ 1(ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ ప్రభావంతో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. సోమవారం మండలంలోని పలు వరద ప్రభావిత ప్రాంతాలు, లోతట్టు గ్రామాలను తహసీల్దార్ నరేష్, ఎంపీడీవో ఉమామహేశ్వర రావు పరిశీలించారు. మల్లాం మార్గంలోని వరద తాకిడి ఉన్న గెరండాలు, రొయ్యల కాలువ, పలు చప్టాలను పరిశీలించారు. అనంతరం లోతట్టు గ్రామమైన పిట్టివానిపల్లిలో పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు.

పార్టీలకు అతీతంగా ఉద్యమం

కోట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు కలపాలన్న డిమాండ్‌తో పార్టీలకు అతీతంగా ఉద్యమం చేపట్టాలని వైసీపీ నేత చిల్లకూరు సాయిప్రసాద్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పనబాక కోటేశ్వరరావు సోమవారం వేర్వేరు ప్రకటనల్లో పిలుపునిచ్చారు. అదే విధంగా కలువాయి, రాపూరు, సైదాపురం మండలాలను నెల్లూరు జిల్లాలోనూ, బాలయపల్లి, డక్కిలి, వెంకటగిరి మండలాలను తిరుపతిలో కలిపి ప్రజలను ఇబ్బందులకు గురిచేశారని కోటేశ్వరరావు అన్నారు.

ఎస్వీయూ ఫార్మసీ కాలేజీ ప్రిన్సిపాల్‌గా రాజేంద్రప్రసాద్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ ఫార్మసీ కాలేజీ ప్రిన్సిపాల్‌గా వై.రాజేంద్రప్రసాద్ నియమితులయ్యారు. ఆంధ్రా యూనివర్సిటీలో బీఫార్మసీ, ఎంఫార్మసీ, పీహెచ్‌డీ పూర్తి చేసి అక్కడే ప్రొఫెసర్‌గా 36 ఏళ్లు పనిచేశారు. ఆంధ్రా వర్సిటీ ఫార్మసీ కాలేజీ ఫ్యాకల్టీ డీన్‌గా, ప్రిన్సిపాల్‌గా సేవలందించారు. 2 పుస్తకాలు, 152 పరిశోధనా వ్యాసాలు ప్రచురితమయ్యాయి. ఆయన పర్యవేక్షణలో 91 మంది పీహెచ్‌డీ పూర్తి చేశారు. ఈ నేపథ్యంలో ఎస్వీయూ ఫార్మసీ కాలేజీ ప్రిన్సిపాల్‌గా నియమిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం బాధ్యతలు స్వీకరించారు.



కోట మండలంలోని గూడలి, విద్యానగర్, బాలాయపల్లి బస్టాండ్ సమీపంలో చెరువులను తలపిస్తున్న ఆర్‌అండ్‌బీ రోడ్లు

రోడ్లు ఛిద్రం

కోట, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు గూడలి నుంచి సముద్ర తీరానికి వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. గూడలి, విద్యానగర్ వద్ద రోడ్డు తెగిపోవడంతో వాహన చోదకులు ఇబ్బందులు పడ్డారు. అదేవిధంగా గూడలి, దక్షిణపాలం వద్ద వారం రోజుల క్రితం విత్తిన పచ్చ విత్తనాలు వర్షం ధాటికి పూర్తిగా దెబ్బతిన్నాయి.

బాలాయపల్లి: గూడూరు - వెంకటగిరి ప్రధాన రహదారిలో బాలాయపల్లి బస్టాండ్ సమీపాన పెద్ద గుంత ఏర్పడడంతో వర్షపు నీరు చేరి కుంటను తలపిస్తోంది. గుంతలోతు తెలియక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అసత్య ప్రచారంపై న్యాయపోరాటం

డక్కిలి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తాను నిధులు దుర్వినియోగం చేశానని సోషల్ మీడియాలో కొందరు అసత్య ప్రచారం చేస్తున్నారని, వారిపై న్యాయ పోరాటం చేస్తానని వెంబులూరు సర్పంచ్ చాముండేశ్వరి అన్నారు. సోమవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన తాను వెంబులూరు పంచాయతీ అభివృద్ధి కోసం కష్టపడి పనిచేస్తుంటే కొందరు సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేయడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ జనరల్ ఫండ్‌తో పాటు 14, 15వ ఆర్థిక సంఘం నిధులను ప్రభుత్వం నిర్దేశించిన విధంగా వినియోగించడం జరిగిందన్నారు. ఖర్చు చేసిన ప్రతి రూపాయికీ లెక్క ఉందని, తనపై తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

జోరు వానలోనూ పింఛన్ల పంపిణీ



పింఛన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, ఏఎంసీ చైర్మన్ రమేష్

సూళ్లూరుపేట, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సూళ్లూరులో సోమవారం జోరువాన కురుస్తున్నా ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఆకుతోట రమేష్, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్‌రెడ్డి, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవ నాయుడు, నాయకులు ఆలీభాయ్, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల అధికారిగా అల్లీబాషా

కోట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కోట మండల సచివాలయాల అధికారిగా అల్లీబాషా సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. చిల్లకూరు మండలంలో గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న అల్లీబాషా పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ



పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న బాస్ సంస్థ సభ్యులు

గూడూరు అర్బన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక మధురెడ్డి కాలనీలో సోమవారం బాస్ స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో లక్ష్మీదంత వైద్యశాల సహకారంతో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు రవీంద్రబాబు, డాక్టర్ నిషాల్, సునీతమ్మ, సుప్రియ, శాంతి, యశ్వంత్ పాల్గొన్నారు.

కల్లోల భరితంగా సముద్రం



కోట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ ప్రభావంతో సముద్రం కల్లోల భరితంగా మారింది. సోమవారం సముద్రంలో భీకర శబ్దాలు చేస్తూ అలలు ఉవ్వెత్తున ఎగిసిపడుతున్నాయి. శ్రీనివాస సత్రం, గోవిందపల్లిపాళెం, యమదిన్నెపాళెం గ్రామాల వద్ద సముద్రంలో భారీ అలలు ఎగిసిపడుతూ కొన్ని మీటర్లు ముందుకు వచ్చింది. ఎన్నడూలేని విధంగా సముద్రంలో అలలు సుడులు తిరుగుతూ తీరాన్ని తాకుతుండటంతో మత్స్యకార గ్రామాలు ఉలిక్కిపడ్డాయి. ఎప్పుడు ఏమి జరుగుతుందోనని మత్స్య కారులు భయాందోళనకు గురయ్యారు. పడవలు, వలలను ఒడ్డుకు చేర్చుకున్నారు. సముద్రంలో అలల ఉధృతి పెరుగుతూనే ఉండటంతో తహసీల్దారు జయజయరావు ఆధ్వర్యంలో తీరప్రాంతంలో రెడ్ అలెర్ట్ ప్రకటించారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

ఓజిలి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ నేపథ్యంలో తహసీల్దారు పద్మావతి, ఎంపీడీవో నారాయణరెడ్డి మండలంలో అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేశారు. సోమవారం వారు ఓజిలి, వెంకటరెడ్డిపాళెం, కురుగొండ, మానమాల తదితర గ్రామాలను సందర్శించి అక్కడి సిబ్బందిని అప్రమత్తం చేశారు. ప్రమాదకర స్థితిలో ఉన్న చెరువులను తహసీల్దారు, ఎంపీడీవో పరిశీలించారు. ఆయా గ్రామాల్లో అవసరమైన చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. గత మూడు రోజులుగా తుపాను కారణంగా ముసురువేసి ఎడతెరపిలేకుండా కురుస్తున్న వర్షాలకు మండలంలోని అన్ని చెరువులకు నీరు చేరింది. కాలువలు, కుంటలు, వరవలు, దొరువులు ప్రవహిస్తున్నాయి. కాగా, మామిడి కాలువ పరివాహక ప్రాంత గ్రామాల ప్రజలను ముందు జాగ్రత్తగా సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

కాలనీలకు రాకపోకలు బంద్

డక్కిలి, డిసెంబర్ 1(ఆంధ్రజ్యోతి): డక్కిలి మండల పరిధిలోని పాతనాలపాడు గ్రామం వద్ద వెలికల్లు వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ఎస్సీ ఎస్టీ కాలనీలకు రాకపోకలు నిలిచి పోయాయి. తహసీల్దారు శ్రీనివాసులు, సీఐ రమణ, ఎస్‌ఐ శివశంకర్ సంఘటనా స్థలానికి చేరుకొని వెలికల్లు వాగు ఉధృతిని పరిశీలించారు.

17న అటవీ శాఖలో వేలం
370 వాహనాల విక్రయానికి ఏర్పాట్లు

మంగళం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): అటవీశాఖ ఆధ్వర్యంలో ఈనెల 17న వాహనాలను వేలం వేయనున్నారు. ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ 8 రేంజ్‌లలో పట్టుబడిన 370 వాహనాలను వేలం వేస్తున్నారు. అత్యధికంగా తిరుపతి రేంజ్ నుంచి 160 వాహనాలు వేలం వేస్తున్నారు. ఇందులో ద్విచక్ర వాహనాలు, కార్లు, జీప్‌లు, లారీలు, ఆటోలు, మినీలారీలు ఉన్నాయి. కొనుగోలు చేయాలనుకునే వారు ముందుగా ఆయా రేంజ్‌ల పరిధిలోని అటవీ శాఖ కార్యాలయాలకు వెళ్లి వాహనాలను పరిశీలించి, వేలం పాటలో పాల్గొనవచ్చు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు



మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ చెంచుబాబు

తడ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): హత్యకేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు తెలిపిన వివరాల మేరకు... తడ మండల పరిధిలోని చేనిగుంటలో పంక్చర్ షాపు నిర్వహిస్తున్న బిహార్ రాష్ట్రానికి చెందిన సహమద్ ఆలీతో గత నెల 26వ తేదీ సాయంత్రం మీజూరు ప్రతాప్ గొడవ పడ్డాడు. సర్దిచెప్పడానికి వచ్చిన కోగిలి రామయ్యతో పాటు సహమద్ ఆలీని ఇనుపరాడ్ కొట్టి గాయపరిచాడు. వారికి ఆస్పత్రికి తరలించగా సహమద్ ఆలీ (45) మృతి చెందాడు. ఈ కేసులో నిందితుడైన మీజూరు ప్రతాప్‌ను సోమవారం ఉదయం అండగుండాల గ్రామ సమీపంలో పోలీసులు అరెస్టు చేశారు. కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించారు. నిందితుడిని పట్టుకోవడానికి కృషి చేసి సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ, తడ ఎస్‌ఐ కొండపనాయుడును జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు అభినందించారని డీఎస్పీ చెంచుబాబు తెలిపారు.

మద్యం మత్తులో నదిలోకి దిగిన వృద్ధుడు
కాపాడిన పోలీస్, అగ్నిమాపక సిబ్బంది

నాయుడుపేట టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఓ వృద్ధుడు స్వర్ణముఖినదిలో దిగి ఇరుక్కుపోయిన సంఘటన నాయుడుపేటలో జరిగింది. సోమవారం సాయంత్రం స్వర్ణముఖినదిలో అయ్యప్పస్వామి భక్తులు స్నానాలు చేస్తుండగా మద్యం మత్తులో ఉన్న వృద్ధుడు నదిలోకి దిగాడు. గమనించిన అయ్యప్ప భక్తులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనాస్థలికి చేరుకున్న డీఎస్పీ చెంచుబాబు ఆధ్వర్యంలో పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది నదిలో బ్రిడ్జి కింద భాగంలో ఇరుక్కుపోయిన వృద్ధుడిని సురక్షితంగా బయటకు తీసి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పేరు, చిరునామా చెప్పేందుకు ఆ వృద్ధుడు నిరాకరించాడు.

గుండెపోటుతో డ్రైవర్ మృతి



మృతి చెందిన శరవణన్

సూళ్లూరుపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఓ ప్రైవేట్ బస్సు డ్రైవర్ గుండెపోటుతో మృతి చెందిన ఘటన సోమవారం సూళ్లూరుపేటలో చోటు చేసుకుంది. చెన్నై నుంచి నెల్లూరుకు ప్రయాణికులతో వెళ్తున్న ఓ ప్రైవేట్ సూళ్లూరుపేట ఆర్టీసీ బస్టాండుకు చేరుకుంది. డ్రైవర్ శరవణన్(50) బస్సు దిగి మూత్ర విసర్జనకు వెళ్లొచ్చాడు. తిరిగి బస్సు బయలుదేరే సమయంలో గుండెపోటు రావడంతో స్టీరింగ్ పైనే వాలిపోయాడు. వెంటనే కండక్టర్, ప్రయాణికులు బస్టాండు సమీపంలో ఉన్న ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. శరవణన్ స్వస్థలం తమిళనాడులోని పెరియపాలెం గ్రామం అని తెలిసింది.

పేదల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం



లబ్ధిదారులకు పింఛను అందజేస్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పనిచేస్తున్నారని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. సోమవారం స్థానిక 17వ వార్డులో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రణాళికబద్ధంగా అమలు చేస్తున్నారన్నారు. నియోజకవర్గంలో ప్రతినెలా పింఛన్ల ద్వారా రూ.16.57 కోట్లు పంపిణీ చేస్తున్నామని, అలాగే ఈనెల నుంచి కొత్తంగా 70 మంది వితంతువులకు పింఛను అందజేస్తున్నామన్నారు. ఇంకా ఎవరైనా అర్హులు ఉంటే సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గూడూరును నెల్లూరు జిల్లాలో కలిపే విషయాన్ని మరోసారి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువెళ్లి సాధించే వరకు ప్రయత్నిస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, నాయకులు పులిమి శ్రీనివాసులు, అబ్దుల్‌రహీం, బిల్లు చెంచురామయ్య, సోమిశెట్టి చెంచురామయ్య, బత్తిన ప్రణీత్, ఓంప్రకాష్, రవీంద్రరెడ్డి, శ్రీధర్, పూర్ణచంద్రరావు, గోపాల్‌రావు, మునిగిరీష్, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు పురస్కారం



వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ నుంచి ఉత్తమ సేవా పురస్కారాన్ని అందుకుంటున్న డాక్టర్ లక్ష్మీనారాయణ

గూడూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏరియా ఆస్పత్రిలోని బ్లడ్ బ్యాంకులో విధులు నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది ఉత్తమ సేవా పురస్కారాన్ని అందుకున్నారు. సోమవారం ప్రపంచ ఎయిడ్స్ డే సందర్భంగా తుమ్మలపల్లి కళాక్షేత్రంలో వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ చేతుల మీదుగా బ్లడ్‌బ్యాంకు మెడికల్ ఆఫీస్ డాక్టర్ లక్ష్మీనారాయణ, ల్యాబ్ టెక్నీషియన్ మౌలాలి, సిబ్బంది బాబురావు, ఆదిశేషయ్య, దిలీప్ ఉత్తమ సేవా పురస్కారాలను అందుకున్నారు. వీరిని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షరీనా, ఆర్‌ఎంవో డాక్టర్ ప్రసూన, వైద్యులు అభినందించారు.

బీఎస్ఎన్ఎల్ ప్రిన్సిపల్ జీఎంగా వెంకట శ్రీకుమార్

తిరుపతి(సెంట్రల్), డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): బీఎస్ఎన్ఎల్ తిరుపతి జిల్లా(ఉమ్మడి చిత్తూరు జిల్లా) ప్రిన్సిపల్ జీఎంగా అల్లాడి వెంకట శ్రీకుమార్‌ను నియమిస్తూ ఉత్తర్వులు వచ్చాయి. ఇక్కడ ఉన్న అమరేంద్ర రెడ్డి నవంబరు 30న ఉద్యోగ విరమణ చేశారు.

'అఖండ2' త్రిశూల యాత్ర ప్రారంభం



శ్రీకాళహస్తి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి అఖండ బృందం ఆ సినిమాలో ఉపయోగించిన త్రిశూలం, డమరుకంతో సోమవారం దర్శించుకుంది. హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ నటించి అఖండ2 ఈనెల 5న విడుదల కానున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో కథానాయకుడు పాత్రధారి ఉపయోగించిన త్రిశూలం, డమరుకం సహా పంచ శైవక్షేత్రాలను దర్శించే కార్యక్రమానికి అఖండ బృందం సోమవారం శ్రీకాళహస్తి నుంచి శ్రీకారం పలికింది. ముక్కంటి ఆలయం వద్దకు వచ్చిన ఈ బృందానికి టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారి గురవారెడ్డి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా నందమూరి బాలకృష్ణ హెల్పింగ్ హ్యాండ్స్ అధ్యక్షుడు జగన్‌మోహన్ మాట్లాడుతూ... కంచి, అరుణాచలం, జంబుకేశ్వరం, చిదంబరం ఐదు క్షేత్రాలను పూర్తి చేస్తామన్నారు.

మాదిగల విజయోత్సవ సభను జయప్రదం చేయండి

బుచ్చినాయుడుకండ్రిగ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మూడు దశాబ్దాల సుదీర్ఘ ఉద్యమం తరువాత ఎస్సీ వర్గీకరణలో 59 ఉపకులాలకు రిజర్వేషన్లు సాధించినందుకు ఈనెల 4న విజయవాడలోని జింఖానా గ్రౌండ్‌లో జరిగే విజయోత్సవ సభ ను మాదిగలు, ఉపకులాలు విజయవంతం చేయాలని ఏపీ ఎమ్మార్పీఎస్ నాయకుడు కొమ్మల రాఘవయ్య మాదిగ పిలుపు నిచ్చారు. మండల కేంద్రంలో మాదిగ నాయకులతో కలసి విజయోత్సవ పోస్టర్లను ఆవిష్కరించారు. గంధం పొండయ్య, వెంకి, ఎల్లయ్య, సుబ్బారావు, వెంకటేశు తదితరులు పాల్గొన్నారు.

క్వాంటమ్ కంప్యూటింగ్‌తో విప్లవాత్మక మార్పులు



సూచనలిస్తున్న ప్రొఫెసర్ రితీష్ కుమార్

నారాయణవనం, డిసెంబరు 1(ఆంధ్ర జ్యోతి): క్వాంటమ్ కంప్యూటింగ్ భవిష్యత్తులో పారిశ్రామిక రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకు వస్తుందని తిరుపతి ఐఐటీ ఫిజిక్స్ ప్రొఫెసర్ రితీష్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో క్వాంటమ్ కంప్యూటింగ్‌పై అధ్యాపకులకు 5 రోజుల శిక్షణ కార్యక్రమం జరిగింది. 5వ తేది వరకు జేఎన్‌టీయూఏ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం, అనంతపురం ఫ్యాకల్టీ డెవలెప్‌మెంట్ సెంటర్ సంయుక్తంగా నిర్వహిస్తున్న కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రితీష్ కుమార్... క్వాంటమ్ కంప్యూటింగ్ ప్రాముఖ్యం, ప్రాథమిక సూత్రాలు, ఆధునిక పరిశోధన ధోరణలపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి వివిధ కళాశాలల నుండి 40 మంది అధ్యాపకులు హాజరయ్యారు. ప్రిన్సిపాళ్లు బి.మధు, ఎం.జనార్దనరాజు, హెచ్‌వోడీలు మల్లిక, మురళి, కుమార్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ హేమబాల, ఆర్గనైజింగ్ కమిటీ కోఆర్డినేటర్ నాగరాజు పాల్గొన్నారు.

ఆధునిక వ్యవసాయం వైపు మొగ్గు చూపండి



వేరుశనగ బస్తాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

సత్యవేడు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో ఆధునిక పద్ధతులను అందిపుచ్చుకుని రైతులు అభివృద్ధి సాధించాలని ఎమ్మెల్యే ఆదిమూలం కోరారు. సోమవారం మండలంలోని మదనంబేడు రైతు సేవా కేంద్రంలో మండల రైతు ఉత్పత్తిదారుల అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన వేరుశనగ విత్తనాల పంపిణీకి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నేటి పరిస్థితులకు అనుగుణంగా సాంకేతికతను వ్యవసాయంలో అనుసంధానం చేసుకోవాలన్నారు. ఇందుకు సంబంధించి రైతు ఉత్పత్తిదారుల సమైక్య బాధ్యత తీసుకోవాలన్నారు. కేవలం వేరుశనగ విత్తనాలు పంపిణీ చేస్తే సరిపోదని, విత్తడం మొదలు పంట చేతికొచ్చే వరకు తగిన సలహాలు సూచనలను ఇవ్వాల్సి ఉందన్నారు. భూసారాన్ని పరిరక్షించుకోవడానికి రసాయన ఎరువులను తగ్గించి సేంద్రియ ఎరువులను వినియోగించాలన్నారు. అంతకుముందు పేరడంలో పింఛన్లు పంపిణీ చేశారు. ఎంపీడీవో కార్యాలయ ఏవో త్రివిక్రమరావు, శ్రీకాళహస్తి రైతు ఉత్పత్తిదారుల అసోసియేషన్ చైర్మన్ రెడ్డివారి భక్తిరెడ్డి, రైతు ఉత్పత్తిదారుల కో-ఆర్డినేటర్ జగదీష్‌కుమార్, ఎన్ఏఎఫ్ కో-ఆర్డినేటర్ మరియా మార్గరెట్, ఏవో మురళి తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

పింఛన్లతో లబ్ధిదారులకు భరోసా: ఎమ్మెల్యే భాను



పింఛను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

పుత్తూరు అర్బన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పింఛన్లతో లబ్ధిదారుల్లో భరోసా కలుగుతోందని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. సోమవారం పుత్తూరు పట్టణంలోని 3వ వార్డులో పింఛన్లను ఆయన పంపిణీ చేశారు. కొత్త పెన్షన్లను కూడా త్వరిత గతిన మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు. 20వ వార్డులో టీడీపీ పట్టణ అధ్యక్షుడు గాలి జీవరత్నం నాయుడు, గేట్ పుత్తూరులోని మహమ్మద్ వీధిలో నగరి నియోజకవర్గ తెలుగుయువత కార్యనిర్వాహక కార్యదర్శి హమీద్‌బాషా, వేపగుంటలో టీడీపీ మండల అధ్యక్షుడు బాలాజీ ఆధ్వర్యంలో పింఛన్ల పంపిణీ జరిగింది.

అపోహలు తొలగితేనే ఎయిడ్స్ దూరం



ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బంది ఆధ్వర్యంలో ఎయిడ్స్ ర్యాలీ

పుత్తూరు, డిసెంబరు 1(ఆంధ్ర జ్యోతి): యువతలో జాగ్రత్తలు, పెద్దల్లో అవగాహన, సమాజంలో అపోహలు తొలగిస్తేనే ఎయిడ్స్‌ను నియంత్రించగలమని ప్రభుత్వ వైద్యాధికారి చంద్రశేఖర్ తెలిపారు. ప్రపంచ ఎయిడ్స్ దినం సందర్భంగా స్థానిక ఆస్పత్రిలో జరిగిన కార్యక్ర మంలో ఆయన మాట్లాడుతూ... ముందస్తు పరీక్షలు, సురక్షిత చర్యలు, బాధితులకు సాయం అందరి బాధ్యత అన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు జరీనా, దీప్తి, సురేష్, అశోక్, సిబ్బంది రమాదేవి, సోమశేఖర్ పాల్గొన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ చంద్రమౌళి ఆధ్వర్యంలో ఎయిడ్స్ దినం జరిగింది.

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలు

పుత్తూరు అర్బన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): తిరుపతి- చెన్నై జాతీయ రహదారిలోని పుత్తూరు మండలం కైలాసపురం వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. శ్రీకాళహస్తి నుంచి తిరుత్తణి వైపు ద్విచక్ర వాహనంలో ప్రయాణిస్తున్న దంపతులు ముందు వెళుతున్న భారీ లారీని అధిగమించబోయి ప్రమాదానికి గురయ్యారు. బైక్ వెనుకవైపు కూర్చున్న మహిళకు కుడికాలు నుజ్జునుజ్జు అయింది. ఆమె భర్తకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను నగరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్టు పోలీసులు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో అఖండ గీతానాదం

పుత్తూరు టౌన్, డిసెంబర్ 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కామాక్షి సమేత సదాశివేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న గీతా సేవా సమాజం ఆధ్వర్యంలో గీతా జయంతి పురస్కరించుకుని సోమవారం ఉదయం అఖండ గీతా పారాయణం నిర్వహించారు. ఉదయం కృష్ణ భగవానుడిని సుప్రభాత సేవతో మేల్కొలిపి, నిత్యా పూజా కైంకర్యాలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి విశేష అభిషేకాలు నిర్వహించి, సుందరంగా అలకరించారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన పారాయణంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని పవిత్ర గీతా శ్లోకాలతో ఆలయ ప్రాంగణాన్ని ఆధ్యాత్మికతతో నింపారు. మధ్యాహ్నం అన్నదానం జరిగింది.

తూర్పున తేలికపాటి వాన





భేరివారి మండపం వద్ద కురుస్తున్న వర్షం - కాళంగి రిజర్వాయర్ గేట్లు ఎత్తడంతో పారుతున్న కాటూరు ఏరు - కేటీరోడ్డులోని పదవమైలు దగ్గర గుంతలమయమైన రోడ్డులో నిలిచి ఉన్న నీరు

శ్రీకాళహస్తి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తిలో సోమవారం తేలికపాటి వర్షం కురిసింది. ఉదయం నుంచి రాత్రి వరకు చిన్నపాటి జల్లులు కొనసాగాయి. శ్రీకాళహస్తి, తొట్టంబేడు మండలాల్లో కూడా దాదాపు ముసురు వాతావరణంతో రోజంతా చలిగాలితో చిరుజల్లులు కురిశాయి. తొట్టంబేడు మండలం కారాకొల్లు మార్గంలో కాళంగి జలాశయం నుంచి నీటి విడుదల కావడంతో లోలెవల్ కాజ్‌వేపై నీరు ప్రవహించింది. దీంతో కారాకొల్లు మార్గంలో రాకపోకలు నిలిపివేశారు.

● తుఫాన్ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. సోమవారం 2వ పట్టణ సీఐ నాగార్జునరెడ్డి సిబ్బందితో పలు లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ... విద్యుత్ తీగలు, స్తంభాలను ముట్టుకోకూడదన్నారు.అవాంఛనీయ ఘటనలు జరిగితే నెం.112కు ఫోన్ చేయాలని తెలిపారు.

బుచ్చినాయుడుకండ్రిగ (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో రెండు రోజులు నుంచి కురుస్తున్న వర్షాలతో వరి నీట మునిగింది. కాళంగి రిజర్వాయర్‌లో నీటిని విడుదల చేయడంతో మండలంలోని కాటూరు ఏరు ఉధృతంగా పారుతోంది. తహానగర్, పూసలపల్లి, బంగ్లాతోట, చిన్నాయ్యగుంట, జంబుగోళం తదితర గ్రామాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. వర్షాలకు శ్రీకాళహస్తి - తడ రోడ్డు గుంతలమయమైంది.

కేవీబీపురం (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొన్ని చెరువులు నిండాయి. సోమవారం ఎస్ఐ నరేష్ పలు చెరువులను పరిశీలించారు. ముఖ్యంగా వగత్తూరు, ఆరె, మిద్దికండ్రిగ, అంజూరు, కళత్తూరు చెరువులు, కాళంగి రిజర్వాయర్‌ను ఆయన పరిశీలించారు.

వరదయ్యపాళెం (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీఎల్ఎన్ పల్లి పంచాయతీలోని సున్నపు కాలువను తహసీల్దార్ సుధీర్‌రెడ్డి తనిఖీ చేశారు. ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి బ్రిడ్జిపైన నీరు ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిపివేశారు. రెవెన్యూ సహాయ అధికారిని నియమించి రాకపోకలు కొనసాగకుండా చూడాలని ఆదేశించారు. అలాగే ఎప్పటికప్పుడు కడూరు, పాండూరు, బత్తలవల్లం కరిపేటి కాలువ వద్ద జాగ్రత్తగా ఉండాలని ఆయా వీఆర్వోలను ఆదేశించారు. వీఆర్‌వోలు నాగేంద్ర, సుజిత తదితరులు తహసీల్దార్‌తో పాల్గొన్నారు.





స్వర్ణముఖినదిని పరిశీలిస్తున్న సీఐ నాగార్జునరెడ్డి - కళత్తూరు వద్ద ఎస్ఐ నరేష్ - సున్నపు కాలువను పరిశీలిస్తున్న తహసీల్దార్ సుధీర్‌రెడ్డి

వర్షంలోనూ జోరుగా పింఛన్ల పంపిణీ





ఊరందూరులో, బ్రాహ్మణతాంగేల్‌లో పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యేలు సుధీర్‌రెడ్డి, ఆదిమూలం - ఏర్పేడులో పింఛన్ల పంపిణీలో టీడీపీ నాయకులు




బీఎన్‌కండ్రిగలో, శ్రీకాళహస్తి 19వ వార్డులో పింఛన్ల పంపిణీ

శ్రీకాళహస్తి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే సుధీర్ అన్నారు. మండలంలోని ఊరందూరులో పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు. గతంలో డయాలసిస్ బాధితులకు రూ.5వేలు ఇచ్చేవారని ప్రస్తుతం తమ ప్రభుత్వం రూ.10వేలకు పెంచి మాటా నిలబెట్టుకుందన్నారు. శ్రీకాళహస్తిమార్కెట్ కమిటీ చైర్మన్ చెంచయ్యనాయుడు, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

● శ్రీకాళహస్తి పట్టణంలోని 19వ వార్డు పరిధిలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు విజయకుమార్, ముక్కంటి ఆలయ పాలకమండలి సభ్యుడు గోపీనాథ్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పంపిణీ చేశారు.

● తొట్టంబేడు మండలంలో టీడీపీ మండల అధ్యక్షుడు రావిళ్ల మునిరాజానాయుడు లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. వర్షంలో కూడా బసవయ్యపాళెం, ఇలగనూరు గ్రామాల్లో పింఛన్లను పంపిణీ చేశారు. కుమార్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● పట్టణంలోని జయరామరావు వీధిలో సోమవారం సచివాలయ సిబ్బందితో కలిసి టీడీపీ రాష్ట్ర బీసీ విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఉమేష్‌రావు పింఛన్లను పంపిణీచేవారు. వన్నియకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల రవి, నాయకులు భీమాల భాస్కర్, వజ్రం కిషోర్, కోట చంద్రశేఖర్, గాజుల భగత్, చాంద్‌బాషా, మురళీకృష్ణ, మణి,కృష్ణమూర్తి, మురళీనాయుడు, గంగసపల్లి రమేష్, రియాజ్ పాల్గొన్నారు.

ఏర్పేడు (ఆంధ్రజ్యోతి): మండలంలో వర్షాన్ని సైతం లెక్కచేయకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. ఆమందూరులో జరిగినపింఛన్ల పంపిణలో ఎంపీడీవో సౌభాగ్యం, ఏర్పేడు, మన్నసముద్రం, బండారుపల్లెల్లో టీడీపీ నాయకులు రాష్ట్ర గురవారెడ్డి, నాగరాజునాయుడు, కృష్ణవేణి, గుణయాదవ్, మనోహర్‌నాయుడు, సుబ్రహ్మణ్యం తదితరులు పంపిణీ చేశారు.

బుచ్చినాయుడుకండ్రిగ (ఆంధ్రజ్యోతి): వర్షంలోను పెన్షన్లు పంపిణీ చేయడంతో పేదల కళ్లలో ఆనందం కనబడిందని మండల టీడీపీ అధ్యక్షుడు సుధాకర్‌నాయుడు, ఏఎంసీ చైర్మన్ జ్యోతి తెలిపారు. బుచ్చినాయుడుకండ్రిగలోని ఈబీసీ కాలనీలో సోమవారం అధికారులతో కలసి పింఛన్లు పంపిణీ చేశారు. వెల్ఫేర్ అసిస్టెంట్ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

నారాయణవనం (ఆంధ్రజ్యోతి): నారాయణ వనం, బ్రాహ్మణతాంగేల్‌లో లబ్ధిదారులకు ఎమ్మెల్యే ఆదిమూలం పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అందిస్తున్న ఫించన్లు పేదలకు, వృద్ధులకు, వికలాంగులకు ఆర్థిక చేయుతని స్తోందన్నారు. జడ్పీటీసీ సభ్యుడు సుమన్ కుమార్, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

సీఎంకు పీఎంకే లేఖ ఆహ్వానించదగ్గది

వన్నియకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్

శ్రీకాళహస్తి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఏపీలో గణనీయ సంఖ్యలో ఉన్న వన్నియకుల క్షత్రియులకు సామాజిక న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సీఎం నారాచంద్రకు పీఎంకే అధినేత అన్బుమణి లేఖ రాయడం ఆహ్వానించదగ్గ విషయమని వన్నియకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల రవి అన్నారు. ఆయన సోమవారం మాట్లాడుతూ వన్నియకుల క్షత్రయ టీడీపీకి నమ్మకమైన కార్యకర్తలుగా నాలుగు దశాబ్దాలుగా సేవలు అందిస్తున్నారన్నారు. 2024 ఎన్నికల్లో టీడీపీ అధినేత చంద్రబాబు విజయం సాధించడంతో బీసీలకు మళ్లీ మంచిరోజులు వచ్చాయన్నారు. బీసీలకు ఎన్నికల్లో ఇచ్చిన ప్రతిహామీని ఆయన అమలు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ యువకుడి మృతి

సత్యవేడు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు మృతి చెందాడు. ఎస్ఐ రామస్వామి తెలిపిన వివరాలు.. మండలంలోని కొత్తమారికుప్పానికి చెందిన సుదర్శన్(22) శ్రీసిటీలోని ఓ పరిశ్రమలో పని చేస్తున్నాడు. గత నెల 24వ తేదీ రాత్రి పరిశ్రమలో పనులు ముగించుకుని ద్విచక్రవాహనంపై ఇంటికి తిరిగి వస్తుండగా అమావాసరెడ్డి కండ్రిగ సమీపంలో రోడ్డుపైన ఆవును తప్పించబోయి అదుపు తప్పి కింద పడి తలకు తీవ్ర గాయమైంది. రక్తస్రావంలోపడి ఉన్న సుదర్శన్‌ని స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ సుదర్శన్‌కు ప్రథమ చికిత్స అందించి చెన్నైకి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సుదర్శన్ సోమవారం మృతి చెందాడు.


పింఛనుదారులకు ఇక్కట్లు



జయరామరావు సచివాలయంలో పింఛను కోసం వేచి ఉన్న లబ్ధిదారులు

శ్రీకాళహస్తి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జయరామరావు వీధి సచివాలయం పరిధిలో పింఛనుదారులకు సోమవారం ఇక్కట్లు తప్పలేదని స్థానికులు వాపోయారు. ప్రతినెలా 1వ తేదీ లబ్ధిదారులకు ఇంటి వద్దకే పింఛను అందిస్తున్న విషయం తెలిసిందే. సోమవారం తుఫాన్ కారణంగా ఇంటింటికీ రాలేమంటూ సచివాలయ సిబ్బంది లబ్ధిదారులను తమ కార్యాలయానికి రావాల్సిందిగా ఆదేశించారు. వర్షంలో వృద్ధులు, వికలాంగులు సచివాలయం వద్దకు చేరుకుని పింఛన్లు అందుకున్నారు. తుఫాన్ సమయంలో ఇలా లబ్ధిదారులను ఇక్కట్లకు గురిచేయడం ఏమిటని స్థానికులు సచివాలయ సిబ్బందిని ప్రశ్నిస్తూ సామాజిక మాధ్యమాల్లో ఆవేదన వ్యక్తం చేశారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

శ్రీకాళహస్తి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి న్యాయస్థానం వద్ద న్యాయవాదులు సోమవారం విధులు బహిష్కరించారు. సహచర న్యాయవాది వినోద్‌పై దాడి చేసి గాయపరిచారన్నారు. ఈ విషయాన్ని పోలీసులకు తెలపగా వారు పట్టించుకోలేదని తెలిపారు. అందుకు నిరసనగా విధులను బాయికాట్ చేసినట్లు తెలిపారు. శ్రీకాళహస్తి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పూడి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు మల్లికార్జునయ్య, కార్యదర్శి తులసీరామ్, సంయుక్త కార్యదర్శి నాగరాజు, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్, న్యాయవాదులు పాల్గొన్నారు.

జిల్లా ఇన్‌చార్జి మంత్రికి సాదర స్వాగతం




రేణిగుంట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రెవెన్యూ శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు సాదర స్వాగతం లభించింది. సోమవారం విజయవాడ నుంచి ఇండిగో విమానంలో తిరుపతి విమానాశ్రయం చేరుకున్న ఆయనకు రాష్ట్ర హస్తకళల కార్పొరేషన్ చైర్మన్ పసుపులేటి హరి ప్రసాద్, తుడా చైర్మన్ దివాకర్ రెడ్డి, శ్రీకాళహస్తి ఆలయ బోర్డు చైర్మన్ కొట్టే సాయి, టీడీపీ నాయకులు తదితరులు స్వాగతం పలికినవారిలో ఉన్నారు. అనంతరం ఆయన రోడ్డు మార్గాన తిరుపతికి బయలుదేరి వెళ్లారు.

మంత్రి అనగానితో ఎమ్మెల్యే సుధీర్



శ్రీకాళహస్తి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా పర్యటన నిమిత్తం సోమవారం జిల్లా ఇన్‌చార్జి, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ విచ్చేశారు. ఇందులోభాగంగా ఆయన పలు కార్యాక్రమాల్లో పాల్గొన్నారు. ఆయనతో పాటు ఎమ్మెల్యే సుధీర్ కూడా పాల్గొన్నారు.

వేదోక్తంగా మృత్యుంజయస్వామికి పూజలు



శ్రీకాళహస్తి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువై ఉన్న మృత్యుం జయుడికి సోమ వారాన్ని పురస్క రించుకుని వేదోక్తంగా పూజలు నిర్వహించారు. ముందుగా వినాయకుడిని సుగంధ ద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం మృత్యుంజ యుడికి పాలు, పంచామృతం, చందనం, విభూది, పచ్చకర్పూరంతో అభిషేకాలు జరిపి గజమాల, వెండి నాగాభరణంతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.